
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
శుక్రవారం 7 మార్చి 2025





రైతుల కోసం.. రైతుల పేరిట ఏర్పాటు చేసిన సహకార సంఘాలు అక్రమాలకు నెలవుగా మారాయి. సాంకేతిక పరిజ్ఞానంతో ఇక నుంచి అక్రమాలకు ఆస్కారం లేకుండా.. రుణాల విషయంలో పారదర్శక పద్ధతి అవలంభించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల సహకార వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సహకార వ్యవస్థను పట్టాలెక్కించే దిశగా అడుగులు వేస్తోన్నది. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే పీఏసీఎస్‌లలో జరిగిన అక్రమాలపై దృష్టి పెట్టి అవి పునరావృతం కాకుండా డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పటికే సొసైటీల్లో దాదాపు 95 శాతం ఖాతాలను ఆన్‌లైన్‌చేశారు. సొసైటీలలో జరిగే అవకతవకలకు ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా అడ్డుకట్ట పడనుందని తద్వారా పీఏసీఎస్‌ల బలోపేతానికి కంప్యూటరీ కరణ ద్వారా ప్రభుత్వం తొలి అడుగు వేసినట్లయింది.

- సొసైటీల్లో కొలిక్కి వచ్చిన కంప్యూటరీకరణ

సహకారం.. సాంకేతికం

- ఏప్రిల్ నుంచి పీఏసీఎస్‌ల్లో డిజిటల్ లావాదేవీలు

గతంలో అక్రమాలకు సహకారం

ఐదేళ్ల వైసీపీ హయాంలో పీఏసీ ఎస్‌లను అన్ని విధాలుగా కునారిల్లేలా చేసింది. ప్రతిఏటా సొసైటీల్లో ప్రవేశపెట్టే ఆడిట్ నివేదికలను కూడా తొక్కిపట్టి పెద్దఎత్తున అక్రమాలకు తెరతీసింది. అర్హత లేని ఎంతోమందికి రాజకీయ పరపతి ద్వారా సొసై టీల్లో ఉన్న సొమ్ములను దోచిపెట్టింది. త్రీమెన్ కమి టీల పేరిట ఐదేళ్ల పాటు ఓ ప్రహసనాన్ని నడిపింది. సొసైటీల్లో పనిచేసే ఉద్యోగులను పర్మినెంట్ చేసే ప్రక్రియలో కూడా ముడుపుల పర్వానికి తెరతీసి అర్హత కలిగిన ఎంతోమందికి వేదనను మిగిల్చింది.

నేడు కూటమి బలోపేతం

డీసీసీబీ శాఖల్లోని ఖాతాలను ఆన్‌లైన్ చేయడంతో పాటు సొసైటీలు సొంతంగా నిలదొక్కుకునే విధంగా కూడా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. ఆయా సహకార సంఘాల ద్వారా ఇతర వ్యాపారాల కోసం ఆసక్తి ఉన్న వారికి డీసీసీబీ ద్వారా రుణాలు ఇప్పించి వాటిని బలోపేతం చేసి, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని రైతుల కోసం ఖర్చు పెట్టాలనే ఆలోచనను ప్రభుత్వం చేసింది. మొత్తంగా చూస్తే పీఏసీఎస్‌లకు జవసత్వాలు కల్పించడం ద్వారా సహకార సొసైటీల వ్యవస్థ సుదీర్ఘ కాలం రైతులకి సేవలందిస్తూ ఉండాలని, అందుకు కావాల్సిన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సమాయత్తమవుతోంది.

- ఆన్‌లైన్‌తో డీసీసీబీ శాఖల్లో అవకతవకలకు అడ్డుకట్ట
- అన్నివిధాలుగా సొసైటీలను కునారిల్లేలా చేసిన గత ప్రభుత్వం
- సహకార వ్యవస్థను పట్టాలెక్కించే దిశగా అడుగులు వేస్తోన్న కూటమి ప్రభుత్వం



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సాంకేతిక సహకారంతో సహకార వ్యవస్థను గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఇంతకాలం సహకార వ్యవస్థ అక్రమాలతో నిండిపోగా పాలకవర్గాలు, ఉద్యోగుల అవినీతితో రైతులకు అందాల్సిన రుణాలు పక్కదారి పట్టాయి. దీనికితోడు గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో పాలకుల నిర్ణయాలతో మొత్తం వ్యవస్థే గాడి తప్పింది. దీంతో కూటమి ప్రభుత్వం పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం)ల్లోని ఖాతాలన్నింటినీ ఆన్‌లైన్ చేసేందుకు డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. తద్వారా సంబంధిత లావాదేవీల్లో జరిగిన లొసుగులు బయటపడడంతో పాటు అక్రమార్కులపై చర్యలు తీసుకోవడానికి వీలుంటుందనేది ప్రభుత్వ ఆలోచన. ఇది చేపట్టి ఇప్పటికే నాలుగు నెలలు గడుస్తుండగా ఖాతాల కంప్యూటరీకరణ కొలిక్కి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని డీసీసీబీ పరిధిలో 167 పీఏసీఎస్‌లు ఉన్నాయి. బాపట్ల జిల్లాకు వచ్చేసరికి ఈ సంఖ్య 112గా ఉంది. ఇందులో గుంటూరులోని డీసీసీబీ పరిధిలో 44 పీఏసీఎస్‌లు ఉండగా, ఒంగోలులోని డీసీసీబీ కింద 68 సహకార సొసైటీలు ఉన్నాయి. వీటికి సంబంధించి దాదాపు 95 శాతం ఖాతాల ప్రక్రియ ఆన్‌లైన్ పూర్తయింది. ఉమ్మడి గుంటూరు పరిధిలోని పీఏసీఎస్‌లలో 90 శాతం ఖాతాల డిజిటలైజేషన్ కొలిక్కి రాగా ఈ నెల పదిహేను కల్లా వందశాతం ఖాతాల ఆన్‌లైన్ పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసిన ప్రభుత్వం మొత్తం డిజిటలైజేషన్ దాని ద్వారానే చేపడుతోంది. ఏప్రిల్ నుంచి లావాదేవీలన్నీ ఆన్‌లైన్ ద్వారానే జరుగుతాయని తద్వారా రోజువారీ ప్రగతి నివేదికలు తెలుసుకోవడానికి (మిగతా 10వ పేజీలో)



పల్నాడు ప్రథమం

- లక్ష్యం కంటే అధికంగా సీసీఆర్ కార్డుల పంపిణీ
- కొద్దిగా వెనకబడిన గుంటూరు, బాపట్ల జిల్లాలు
- ఈ-క్రాప్, వ్యవసాయ రుణాలకు మార్గం సుగమం

గుంటూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతుల కష్టాలు తీరిపోతున్నాయి. ఈ-క్రాప్ బుకింగ్, వ్యవసాయ రుణాలు పొందేందుకు ఇంతకాలం అవస్థలు పడిన కౌలు రైతులకు మేలు చేసేలా క్రాప్ కల్టివేటర్ రైట్స్(సీసీఆర్) కార్డుల మంజూరుపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. అయితే ఈ కార్డుల మంజూరులో పల్నాడు జిల్లా లక్ష్యాలను అధిగమించింది. కేటాయించిన లక్ష్యం కంటే అధికంగా పంపిణీ చేసి ఉమ్మడి గుంటూరు జిల్లాలో పల్నాడు ప్రథమస్థానంలో నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ లక్ష్యాన్ని 10 జిల్లాలు అధిగమించగా అందులో పల్నాడు జిల్లా ఒకటిగా నిలవడం విశేషం. మరోవైపు గుంటూరు, బాపట్ల జిల్లాలు కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు ఇవ్వడంలో కొంత వెనకబడ్డాయి. సాధ్యమైనంత త్వరగా లక్ష్యాన్ని అధిగమించాలని ప్రభుత్వం రెండు జిల్లాల అధికారులను ఆదేశించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పల్నాడు జిల్లాలో 65 వేల మంది కౌలురైతులకు సీసీఆర్ కార్డులు మంజూరు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించగా 65,126 కార్డులు మంజూరు చేసి 100 శాతం లక్ష్యాన్ని అధికారులు అధిగమించారు. మరోవైపు గుంటూరు జిల్లాకు 46,670 సీసీఆర్ కార్డులు లక్ష్యం ఇవ్వగా 39,424 కార్డులు మంజూరు చేసి 84 శాతం పురోగతిని నమోదు చేయగలిగింది. బాపట్ల జిల్లాకు గుంటూరు, పల్నాడు కంటే అధిక లక్ష్యాన్ని ప్రభుత్వం ఇచ్చింది. ఈ జిల్లాలో 1,06,670 కార్డులు వ్యవసాయ సీజన్‌లో మంజూరు చేయాల్సిందిగా లక్ష్యం కేటాయించగా 88,219 కార్డులు మంజూరు చేసి 83 శాతం పురోగతిని సాధించింది. ప్రస్తుతం రబీ సీజన్ కూడా ముగింపు దశకు చేరుకున్నది. ఈ నేపథ్యంలో వచ్చే ఖరీఫ్ సీజన్‌కి అయినా ఎక్కువ సంఖ్యలో సీసీఆర్ కార్డులు మంజూరు చేయాల్సిన బాధ్యత ఆయా జిల్లా యంత్రాంగాలపై ఉన్నది. మరో రెండు నెలల్లో ఖరీఫ్ రుణాల పంపిణీ మొదలు అవుతుంది. ఈ దృష్ట్యా ఇప్పటి నుంచే వాటిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నది.

త్వరలో కౌలు రైతుల కోసం చట్టం..

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో చాలావరకు కౌలు రైతులే పంటలు సాగు చేస్తున్నారు. అయితే ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వీరికి ఎలాంటి నష్టపరిహారం అందడం లేదు. మరోవైపు పంటలు సాగుకి బ్యాంకర్ల నుంచి రుణాలు కూడా పొందలేని పరిస్థితి. ఇందుకు కారణం భూమికి సంబంధించిన హక్కులన్నీ సంబంధిత యజమాని ఆధీనంలోనే ఉంటాయి. తాను పంట వేయకపోయినా బ్యాంకుల నుంచి రుణం తీసుకోగలుగుతాడు. అలానే ప్రకృతి విపత్తులు చోటు చేసుకున్నప్పుడు అధికారుల వద్ద ఉన్న డేటాలో యజమాని పేరే ఉంటుంది కాబట్టి ఆయనే నష్టపరిహారం పొందుతున్నాడు. కౌలురైతుల కోసం గత ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా అవి వారికి అక్కరకు రాలేదు. కూటమి ప్రభుత్వం కౌలురైతుల చట్టాన్ని సవరించి వారికి లబ్ధి చేకూర్చేందుకు ఇటీవలే రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహించి ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నది. త్వరలోనే కొత్త చట్టం అమలులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నది.

సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం

- పురుగు మందులతో ఆరోగ్యానికి హాని
- ప్లాస్టిక్, రసాయనిక ఎరువులతో క్యాన్సర్
- వార్షిక ప్రణాళికపై సమీక్షలో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, వాటి ఉత్పత్తులను మరింతగా పెంచాలని కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. సేంద్రియ వ్యవసాయ వార్షిక ప్రణాళికపై అనుబంధశాఖల అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగుమందులు వినియోగం లేకుండా పంటలు సాగు చేయాలని చెప్పారు. సాంప్రదాయ పద్ధతిలో వ్యవసాయం సాగు చేస్తేనే ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించగలమన్నారు. ఎరువులు, పురుగుమందులు వాడకం పెరగడంతో ప్రజల ఆరోగ్యానికి భద్రత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్, రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగంతో క్యాన్సర్ వంటి రోగాలకు ప్రజలు గురవుతున్నారన్నారు. ప్రజా ఆరోగ్యాన్ని పరిరక్షించాలంటే సాంప్రదాయ వ్యవసాయానికి అనుకూలంగా రైతులు నడుం బిగించాలన్నారు. రైతులే స్వయంగా విత్తనాలు, జీవామృతం వంటి సేంద్రియ ఎరువులను తయారు చేసుకుని వినియోగించుకోవాలన్నారు. 2025వ సంవత్సరంలో జిల్లాలో 1,07,165 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలోనే పంటలు సాగు చేయాలని వార్షిక ప్రణాళిక రూపొందించినట్లు ప్రకటించారు. 62,097 మంది రైతులను సేంద్రియ వ్యవసాయ పద్ధతిలోకి తెచ్చేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సంవత్సరం వరి, శనగ, మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న, కూరగాయలు, పండ్ల తోటల సాగు విస్తృతంగా చేపట్టాలన్నారు. సేంద్రియ వ్యవసాయంపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ నెల 30లోగా ఖరీఫ్ పంటల సాగుపై గ్రామస్థాయిలో సమగ్రప్రణాళిక రూపొందించాలని సూచించారు. పంటచేతికి వచ్చిన తదుపరి రైతులకు మంచి ధర లభించేలా మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి కె.రామకృష్ణ, సేంద్రియ వ్యవసాయం ఏపీసీఎన్‌ఎఫ్‌డీపీఎమ్ వాణిశ్రీ, మోహన్‌కుమార్, ఉద్యానశాఖ ఏడీ జెన్నెమ్మ, డ్వామా పీడీ విజయలక్ష్మి, డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి



ఎంసీఏ హాలును పరిశీలిస్తున్న జేసీ, ఏఎస్పీ, ఆర్డీవో

మహిళా దినోత్సవానికి ఏర్పాట్లు

- హాజరుకానున్న మంత్రులు అనగాని, పార్థసారథి
- రేపల్లెలో ఎంసీఏ హాలు పరిశీలించిన జేసీ, ఏఎస్పీ

రేపల్లె, మార్చి 6 (ఆంధ్ర జ్యోతి): మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం స్థానిక మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్(ఎంసీఏ) హాలును పరిశీలించినట్లు జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. ఈ నెల 8న జరిగే మహిళా దినోత్సవానికి రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి, అనగాని సత్యప్రసాద్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి హాజరుకానున్నట్లు చెప్పారు. మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఏఎస్పీ విఠలేశ్వర్ మాట్లాడుతూ మహిళా దినోత్సవానికి మంత్రులు రానున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ మూర్ల శ్రీనివాసరావు, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావుతో పాటు అనగాని శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో విధులు నిర్వహించాలి

- 14న శింగరకొండ తిరునాళ్లను విజయవంతం చేయాలి
- వివిధ శాఖల అధికారులతో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

అద్దంకి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ తిరునాళ్లలో భక్తులకు సేవ చేస్తున్నామన్న దృక్పథంతో అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. శింగరకొండ 70వ వార్షిక తిరునాళ్ల ఏర్పాట్లపై గురువారం శింగరకొండలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి ఈ నెల 14న జరిగే తిరునాళ్ల విజయవంతానికి కృషి చేయాలన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తాగునీరు, పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డీఎస్పీ మొయిన్ మాట్లాడుతూ తిరునాళ్లలో విద్యుత్ ప్రభలపై ఎలాంటి అశ్లీల, అర్ధనగ్న నృత్యాలకు అనుమతులు లేవన్నారు. బాణసంచా కాల్చరాదన్నారు. రద్దీని ముందుగా గుర్తిం చేందుకు సీసీ కెమెరాలు, డ్రోన్లను ఏర్పాటు చేయాలని దేవస్థానం అధికారులను కోరారు. తిరునాళ్ల రోజు అద్దంకి పట్టణంలో మద్యం షాపులు మూసి వేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులను ఆర్డీవో కోరగా కలెక్టర్ అనుమతి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఈవో తిమ్మానాయుడు, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, ఆర్టీసీ డీఎం రామ్మోహనరావు,తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో శింగయ్య, సీఐ సుబ్బరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.22 (శుక్రవారం)
సహరి : 5.05 (శనివారం)

నేటి నుంచి సాగరమాత మహోత్సవాలు 10

ఎకో టూరిజం.. ఎంజాయ్ చేద్దాం!

- పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ఏర్పాట్లు



ఎల్లవేళలా దయాక్షేత్రంపై ఏసయ్య కరుణ

- పాస్టర్ జాషువా మోజెస్
- లేమల్లెలో 48వ గుడారాల పండగ ప్రారంభం
- లక్షలాదిగా వచ్చిన దైవజనులు, విశ్వాసులు

10లో



దయాక్షేత్రం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అమెరికాకు చెందిన ఫాస్టర్ ఎర్నెస్ట్ పాల్



అమరావతి మండలం లేమల్లె గ్రామంలో ప్రారంభమైన హోసన్న గుడారాల పండుగలో పాల్గొన్న విశ్వాసులు

ముగిసిన లాటరీ

- గీత కులాలకు 12 మద్యం దుకాణాలు కేటాయింపు

బాపట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గౌడ, గౌడ్ సామాజిక వర్గాలకు కేటాయించిన మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని బాపట్ల, రేపల్లె, వేమూరు, నగరం, చీరాల, పర్చూరు, అద్దంకి ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో గీతకులాల వారికి 12 మద్యం దుకాణాలు కేటాయించిన విషయం తెలిసిందే. ఆయా దుకాణాలకు 159 దరఖాస్తులు రాగా కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, ఎక్సైజ్ జిల్లా అధికారి జి.దేవదత్తు లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయించారు. దరఖాస్తుదారుల సమక్షంలో వీడియో రికార్డింగ్ ద్వారా లాటరీ ప్రక్రియ జరిగింది. నాన్‌రిఫండ్‌బుల్ ఫీజు రూపంలో రూ.31.80 లక్షలు, ఇన్‌స్టాల్‌మెంట్ రూపంలో రూ.60 లక్షల ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.



గీతకులాల వారికి మద్యంషాపులు కేటాయిస్తున్న జేసీ ప్రఖర్‌జైన్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి దేవదత్తు

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

తాడికొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తాడికొండ ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.జోగారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతిలో 80 సీట్లు, 6,7,8 తరగతుల్లో మిగిలిపోయిన ఖాళీ సీట్లలో ప్రవేశానికి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి 1వ తేదీ నుంచి మార్చి 31వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 25వ తేదీన దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

15న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

గుంటూరు సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో వి.జ్యోతి బసు వెల్లడించారు. అదే రోజు ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు స్టాండింగ్ కమిటీల సమావేశం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సాధారణ సర్వ సభ్య సమావేశం ఆరంభం అవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో వార్షిక బడ్జెట్ పై చర్చ జరగనుంది.

కలెక్టర్‌కు సరెండర్ చేసి నెల దాటినా ఇంకా విధుల్లోనే..

అమరావతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తన కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ బాలకృష్ణ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నాడని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు కలెక్టర్ అరుణ్‌బాబుకు జనవరి 20వ తేదీన సరెండర్ చేస్తూ బాలకృష్ణను రిలీవ్ చేశారు. ఈ సంఘటన జరిగి నెలరోజులు దాటినప్పటికీ సీనియర్ అసిస్టెంట్ కార్యాలయంలో ఆర్ఐ పాత్ర పోషిస్తూ నిబంధనలకు విరుద్ధంగా తన పనులు చేసుకుపోతున్నాడు. కార్యాలయం నుంచి రిలీవ్ కాలేదు. సీనియర్ అసిస్టెంట్ పదవీ కాలం రెండు సంవత్సరాలు పూర్తి కాకుండా ఆర్ఐ విధులు నిర్వహించకూడదని నిబంధనలు ఉన్నాయి. అయినా ఫ్యామిలీ మెంబరు ధ్రువీకరణ పత్రాలను వీఆర్వోలతో సంబంధం లేకుండా తానే అర్జీదారులను కార్యాలయానికి పిలుచుకుని విచారణ జరిపి తహసీల్దార్ ముందు ఉంచుతున్నారు. దానిని తహసీల్దార్ మంజూరు చేస్తున్నారు. అయితే సరెండర్ చేసిన తహసీల్దార్ మాచవరంకు ఇన్‌చార్జిగా వెళ్లడంతో ఇక్కడ తహసీల్దార్‌గా డానియేలును నియమించారు. నాగమల్లేశ్వరరావు మాచవరం వెళ్లినప్పటి నుంచి సీనియర్ అసిస్టెంట్ ఆర్ఐగా తన విధులు నిర్వహిస్తున్నాడు. కలెక్టర్‌కు సరెండర్ చేసి రిలీవ్ చేసినప్పటికీ హాజరులో సంతకం చేస్తున్నాడు. జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కొత్త బైపాస్‌లో సోలార్ కేబుల్ చోరీ

నాదెండ్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం, నాదెండ్ల గ్రామాల పరిధిలో కొత్తగా నిర్మించిన బైపాస్‌లో ఏర్పాటు చేసిన సోలార్ కేబుల్‌ను అపహరించారు. ఈ విషయ మైవీ స్పార్కిల్ ఎండీ కల్లూరు నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గణపవరం గ్రామ పరిధిలోని కొత్త బైపాస్‌లో సుమారు 10వేల మీటర్ల కేబుల్ చోరీకి గురైనట్టు పేర్కొన్నారు. కేబుల్‌లోని కాపర్ కోసం ఈ చోరీకి పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేబుల్ విలువ సుమారు 2.20 లక్షలు ఉంటుందని వివరించారు.

బోధనలో సమూల మార్పులు

- సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త పోకడలు
- వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక సాంకేతిక యుగంలో బోధనా పద్ధతులు రూపాంతరం చెందుతున్నాయని ఏఎన్యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు పేర్కొన్నారు విశ్వవిద్యాలయంలోని విద్యా విభాగం ఆధ్వర్యంలో ఎడ్యుకేషనల్ పర్స్పెక్టివ్స్ అండ్ రోల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేటర్స్ ఇన్ ఇండియా అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ బోధన పద్ధతులు నిరంతరం మారుతూనే ఉన్నాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెంది బోధన ఎక్కడ నుంచైనా వినే అవకాశం కలిగిందన్నారు. కరోనా తరువాత ఇటువంటి అవకాశాలు పుష్కలంగా రూపాంతరం చెందినట్లు వివరించారు. విద్యార్థి అనుకున్న రీతిలో బోధన పద్ధతులు నేడు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. నేటి తరాన్ని తీర్చిదిద్దేందుకు అధ్యాపకులు కూడా నూతన నైపుణ్యాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాదులోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ విద్యా విభాగం ఆచార్య వనజ మాట్లాడుతూ ప్రపంచం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. దీనిని పసిగట్టాలంటే తప్పనిసరిగా విద్యావంతులు కనీస విద్య అవగాహన ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నైపుణ్యాలను పెంచుకుంటున్నారని వివరించారు. జపాన్ దేశం 2017లోనే విద్య విధానంలో 5.0 విధానంలో దూసుకుపోతుందని పేర్కొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కె.రత్నశీలమణి మాట్లాడుతూ నాణ్యమైన బోధనకు అర్హత గల అధ్యాపకులు న్యాయం చేస్తారని సూచించారు. సదస్సు డైరెక్టర్ ప్రొఫెసర్ పి.బ్రహ్మాజీరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీఈడీ, ఎంఈడీ కోర్సుల్లో కొత్త మార్పులు వస్తాయన్నారు. సదస్సుకు 80 పరిశోధన పత్రాలు వచ్చాయని, వాటిని పుస్తక రూపంలో తీసుకువచ్చినట్లు వివరించారు. ప్రముఖ విద్యావేత్త గద్దె మంగయ్య మాట్లాడుతూ అభివృద్ధికి విద్య అనేది మొదటి అడుగుగా అభివర్ణించారు. సదస్సుకు కన్వీనర్లుగా డాక్టర్ ఎం. వసంతరావు, డాక్టర్ రామిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ సందీప్ వ్యవహరించారు. సదస్సులో దేశంలోని పలు కేంద్రీయ విశ్వవిద్యాలయాల నుంచి సీనియర్ అధ్యాపకులు ప్రొఫెసర్స్ కె.సుమలత, వి.రవి, పి.ఆడం పాల్, టి.షారోన్ రాజు, ఈ. అశోక్ కుమార్, టి.ఇస్మాయిల్, పి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నందిగం, కొల్లా వివాహ మహోత్సవం



వధూవరులను ఆశీర్వదిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

- పలువురు ప్రముఖుల హాజరు

గుంటూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డులోని శ్రీకన్వెన్షన్‌లో శివశక్తి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ నందిగం శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతుల కుమారుడు సునీల్ కుమార్, ప్రముఖ వ్యాపారవేత్త కొల్లా శ్రీమన్నారాయణ, మాధవి దంపతుల కుమార్తె నూతన వివాహ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన వధూవరులను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, లీలావతి దంపతులు, టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు (గురజాల) నక్కా ఆనందబాబు (వేమూరు), జూలకంటి బ్రహ్మారెడ్డి (మాచర్ల), ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, మర్రి రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య, ఎస్‌పీఎఫ్ ఐజీ త్రివిక్రమవర్మ, శ్రీరామ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వైస్ ఛైర్మన్ ఆర్ దుర్వాసన్, హైదరాబాద్ రెరా డిప్యూటీ డైరెక్టర్ (టెక్నికల్) నాదెండ్ల తిరుపతయ్య, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు పంచుమర్తి భూపతిరావు, ఈడే మురళీకృష్ణ, పలువురు ప్రముఖులు ఆశీర్వదించారు.

మంగళాద్రిలో వైభవంగా ధ్వజారోహణం

- సకల దేవతలకు బ్రహ్మోత్సవ ఆహ్వానం

మంగళగిరి సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలలో కీలక ఘట్టమైన ధ్వజారోహణ కార్యక్రమాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను, భక్తజనులను ఆహ్వానించేందుకు శ్రీస్వామివారి సేవకుడైన గరుత్మంతుని పంపిస్తూ గరుడ ధ్వజాన్ని ఆవిష్కరించడం సంప్రదాయంగా వస్తోంది. దీనిప్రకారం గరుత్మంతుని చిత్రం ముద్రించిన పతాకాన్ని గరుడ ధ్వజంగా ధ్వజ స్తంభానికి ఆవిష్కరిస్తూ ధ్వజారోహణం గావించారు. ఋత్విగ్వరణ, అంకురారోపణాది కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం అర్చక స్వాములు ఈ ఉత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అష్టనాగాధిపతియైన గరుత్మంతునికి నివేదన చేసిన ప్రసాదాన్ని గరుడ ముద్దల పేరుతో భక్తులకు పంపిణీ చేశారు. సంతానం లేని మహిళలు ఈ ప్రసాదాన్ని స్వీకరించినట్టయితే వారికి శీఘ్రగతిన సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ కారణంగా గరుడ ముద్దలను స్వీకరించేందుకు పలువురు మహిళలు



గరుడ ముద్దలను ప్రసాదంగా స్వీకరిస్తున్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీనృసింహస్వామి

ధ్వజారోహణ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఈ ఉత్సవానికి మంగళగిరి మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ వారు కైంకర్యపరులుగా వ్యవహరించారు. ధ్వజారోహణ ఉత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో నియమ నిష్ఠలతో నిర్వహించారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నుంచి వాహన సేవలు

శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం నుంచి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి ప్రధాన వాహన సేవలు ఆరంభం కానున్నాయి. తొలిరోజు స్వామివారు హనుమంత వాహనంపై విహరిస్తారు. 8న రాజాధిరాజ వాహనం, 9న ఉదయం ముత్యాల పల్లకీ వాహనం, రాత్రి యాలి వాహనం, 10న ఉదయం చిన్న శేష వాహనం, అదేరోజు రాత్రి సింహ వాహనం, 11న ఉదయం హంస వాహనం, అదేరోజు రాత్రి గజ వాహనం, 12న ఉదయం కల్పవృక్ష వాహనం, అదేరోజు రాత్రి పొన్న వాహన సేవ, 13న ఉదయం అశ్వ వాహన సేవ నిర్వహిస్తారు. అదేరోజు అర్ధరాత్రి స్వామివార్ల కల్యాణం జరుగుతుంది.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

గుంటూరు(తూర్పు), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మే 18 నుంచి 20 వరకు గుంటూరులో జరగనున్న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ నాగబ్రహ్మచారి, సీపీడీసీఎల్ అధ్యక్షుడు దాసరి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక బ్రాడీపేటలోని సీఐటీయూ నగర కార్యాలయంలో రాష్ట్ర మహాసభల ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్తు ప్రణాళిక రూపొందించుకునేందుకు రాష్ట్ర మహాసభల్లో కీలకమైన నిర్ణయాలు చేసేందుకు వేదిక కానున్న మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు బి. లక్ష్మణరావు, నాయకులు సుబ్బారెడ్డి, రాం ప్రభాకర్, చెన్నకేశవులు, చంద్రశేఖర్ ఆచారి, గాలిబ్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

ముందస్తు బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ

నరసరావుపేట లీగల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): డిపాజిట్ దారులు, చిట్టీ పా టదారుల నుంచి సుమారు రూ. 400 కోట్ల మేరకు వసూలు చేసి మోసం చేసినట్లు నరసరావుపేట మొదటి పట్టణ పోలీస్‌స్టేషన్లో దాఖలైన కేసులో చిట్‌ఫండ్స్ నిర్వాహకుడు పాలడుగు పుల్లారావు కుటుంబ సభ్యులు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై నరసరావుపేట 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో శుక్రవారం వాదనలు జరగనున్నాయి.. పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ వేలూరి సుబ్బారెడ్డి మొదటి పట్టణ పోలీసులకు చేసిన ఫిర్యాదులో పాలడుగు పుల్లారావు, అతని కుటుంబ సభ్యులు నిందితులుగా ఉన్నారు. పుల్లారావుపై గుంటూరులో మరో కేసు నమోదు అవ్వడంతో సదర కేసులో గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో మొదటి పట్టణ పోలీసులు పుల్లారావును పీటీ వారెంట్‌పై స్థానిక కోర్టులో ప్రవేశపెట్టి పోలీసు కస్టడీకి అడుగుతూ పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం పిటిషన్ పెండింగ్‌లో ఉంది.

ఆటోలో ప్రయాణికుడిగా ఎక్కి దోపిడీ

తెనాలి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణికుడిగా ఎక్కి విచక్షణా రహితంగా దాడి చేసి డబ్బు దోచికెళ్లిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సీఎం కాలనీకి చెందిన తుమ్మపూడి అశోక్ కుమార్ గుడివాడలో డ్వాక్రా డబ్బులు చెల్లించేందుకు ఆటోలో వెళుతున్నాడు. మార్గమధ్యలో కొలివరం గేట్లు దాటిన తరువాత జనసంచారంలేని ప్రాంతంలో ఓ వ్యక్తి ఆటోలో ఎక్కించుకోవాలని ఆపాడు. ఆటోలో ఎక్కి బండి కదిలిన వెంటనే వెనుక మెడపై పదునైన వస్తువుతో విచక్షణారహితంగా దాడి చేసి అశోక్ కుమార్ వద్ద ఉన్న రూ.11000 తీసుకుని పరారయ్యాడు. మెడ, చేతుల భాగంలో తీవ్ర గాయాలతో బాధితుడు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి ఆటోలో తెనాలి చేరుకున్నాడు. గాయాలతో ఉన్న బాధితుడిని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు పరీక్షలు జరిపి చికిత్స అందిస్తున్నారు.

బ్లేడుతో కుటుంబ సభ్యులపై దాడి

చిలకలూరిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రజక కాలనీకి చెందిన జి.మణికుమార్ దుర్వ్యసనాలకు బానిసై మద్యం తాగడానికి అడిగిన డబ్బులు రూ.30 వేలు ఇవ్వలేదని కుటుంబ సభ్యులతో సహా నలుగురిని దారుణంగా బ్లేడుతో కోసి గాయపరిచిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. గాయపడిన వారిలో కుటుంబ సభ్యులు అయిన తండ్రి కృష్ణారావు, పిన్ని రాజేశ్వరి, అక్క నాగలక్ష్మి, మరో వ్యక్తి హరీష్ ఉన్నారు. పోలీసులకు సమాచారం తెలియడంతో అర్బన్ సీఐ పి.రమేష్, ఎస్ఐ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు జగన్‌కు లేదు

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీకి రాని వ్యక్తికి హామీలపై ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదని శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గురువారం ప్రశ్నించారు. విలేకరులతో మాట్లాడుతూ ఆయన అబద్ధాలు, మోసాలు, హత్యా రాజకీయాలతో ముఖ్యమంత్రి పదవి దక్కించుకొని, 5 ఏళ్ల రాష్ట్రాన్ని దోచుకున్నారని విమర్శించారు. తమ జీవితాలకు సున్నా చుట్టాడనే జగన్‌కు, వైసీపీకి జనం సున్నం బొట్టు పెట్టి మరీ సాగనంపారని అన్నారు. యువతను, నిరుద్యోగుల్ని తానే ఉద్ధరించినట్లు జగన్ మాట్లాడటం హాస్యాస్పదం అని చెప్పారు. 40 లక్షల ఉద్యోగాలు ఇస్తే వైసీపీ పట్టభద్ర ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయలేదో జగన్ చెప్పాలని అన్నారు. రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న ఆర్థిక కష్టాలను అధిగమిస్తూ, ప్రజలకిచ్చిన ప్రతి హామీ అమలుకు కూటమి ప్రభుత్వం శ్రమిస్తోందని వివరించారు. ఎన్నికల ప్రచారంలో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక వాటిలో ఎన్ని అమలు చేశారో ప్రజల్లోకి వచ్చి జగన్ చెప్పగలడా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా పరదాల చాటున, ఇప్పుడేమో నాలుగు గోడల మధ్యన, అదే జగన్‌కు తెలిసిన పాలన అని చెప్పారు.

అహంకార ధోరణి వీడలేదు

- గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



పిడుగురాళ్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జగన్మోహన్‌రెడ్డి ఇంకా అధికారంలోనే ఉన్నామనే భ్రమతో మాట్లాడుతున్నారని, అహంకార ధోరణి వీడలేదని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. వైసీపీ అధికారంలో ఉండగా అవినీతి, అక్రమాలు చేయడమే కాకుండా చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్‌ను, వారి కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. ఎన్నికలకు ముందు చంద్రబాబును అక్రమ అరెస్టు చేయడం వలన రాష్ట్ర ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని అధికారంలో నుంచి దించి కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. 11 సీట్లకే పరిమితం చేసినా జగన్మోహన్‌రెడ్డిలో మార్పు లేదని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై జగన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. తల్లిని, చెల్లిని గౌరవించలేని వ్యక్తి, ఎదుటి వ్యక్తులను ఎలా గౌరవిస్తారనేది అర్థం చేసుకోవాల్సి ఉందన్నారు. జగన్ లాంటి వ్యక్తులను రాజకీయాల నుంచి కాదనీ, సమాజం నుంచే వెలివేయాలని యరపతినేని మండిపడ్డారు.

మహిళలు బహుముఖ ప్రజ్ఞాశాలులు



విశాలాక్షికి బహుమతి అందజేస్తున్న బుడితి రాజశేఖర్, శారదా జయలక్ష్మి

గుంటూరు సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు బహుముఖ ప్రజ్ఞాశాలులని ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ అన్నారు. లాం ఫామ్‌లోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీలో గురువారం జరిగిన మహిళా దినోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి డీన్ ఆఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీ, మహిళా రక్షణ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ ఎ.మణి అధ్యక్షత వహించారు. ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ఏర్పాటు ద్వారా మహిళల జీవితంలో పెను మార్పులు సంభవించాయని అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయా రంగాల్లో నిష్ణాతులైన వారిని సన్మానించడంతో పాటు, మహిళా రైతులను సన్మానించడం గొప్ప భాగ్యమన్నారు. యూనివర్సిటీ వీసీ శారదా జయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉన్నారని తెలిపారు. అనంతరం ఆయా జిల్లాలకు చెందిన మహిళా రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పోలీసుల నుంచి తప్పించుకునే యత్నంలో మృతి

నరసరావుపేట లీగల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పోలీసుల అరెస్టు నుంచి తప్పించుకోవటానికి ఓ లాడ్జిలోని మేడపై బాత్రూంలో ఏర్పాటు చేసిన వెంటిలేటర్ కిటికీ నుంచి కిందకు దూకి ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద చోటుచేసుకుంది. రెండో పట్టణ ఎస్సై అశోక్ బాబు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్ మారేడుమిల్లిలోని తుకారాం గేట్‌కు చెందిన రాములు నాయక్ పై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 22 కేసులు పెండింగ్ ఉన్నాయి. గత నెలలో నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ దేవాలయంలో చోరీ కేసులో నాయక్ నిందితుడిగా ఉన్నాడు. ఆ కేసుకు సంబంధించి బుధవారం అతని భార్యతో కలిసి పట్టణంలోని కోర్టుకు వాయిదా నిమిత్తం వచ్చాడు. రాములు నాయక్ గుంటూరు జిల్లా పత్తిపాడు పరిధిలోని ఓ దేవాలయంలో కూడా చోరీకి పాల్పడినట్లు నిర్ధారించుకున్న గుంటూరు సీసీఎస్ పోలీసులు రాములు ఆచూకీ తెలుసుకొని అదుపులోకి తీసుకున్నారు. రాములు నాయక్‌కు విరోచనాలు అవుతుండడంతో అతని భార్య అభ్యర్థన మేరకు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగల లాడ్జిలో బాత్రూమ్‌కు రాములు వెళ్లాడు. బాత్రూం తలుపులు వేసుకొని వెంటిలేషన్ ఫ్యాన్‌ను తీసివేసి ఆ రంధ్రం నుంచి దూకి పారిపోవడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ జారిపడి తీవ్ర గాయాల పాలై మృతి చెందాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న నరసరావుపేట రెండో పట్టణ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ బాబు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 525.80 అడుగులు ఉంది. ఇది 160.06 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8541 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 18,644 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.10
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్ లెస్	186.00

1,19,950 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,16,671 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,19,950 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 54,938 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	11500	12800
334	9500	13800	బ్యాడిగి 355	10500	13800
నంబరు. 5	10000	13500	సింజెంటా		
273	--	--	బ్యాడిగి 5531	10500	12200
341	10500	14500	ఎన్ఎస్ 250		
4884	10000	11000	బుల్లెట్	--	--
సూపర్ 10	--	--	దేవనూరు డీలక్స్	10000	13300
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఆర్మూరు	10000	11300
తేజ	10500	14000	తాలుకాయలు	5000	7500

నేడు రగ్బీ పురుషులు, మహిళల జట్ల ఎంపిక

కర్లపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బాపట్ల ఆర్ట్స్ సైన్స్ కళాశాలలో శుక్రవారం బాపట్ల జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ పురుషులు, మహి ళల విభాగంలో జిల్లా జట్ల ఎంపికలు జరుగుతాయని జిల్లా కార్యదర్శి పిట్టు సుబ్బారెడ్డి తెలిపారు. రగ్బీ పోటీలకు పాల్గొనే క్రీడాకారులు మార్కులిస్ట్, పుట్టినరోజు ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు ను తీసుకొని రావాలని తెలిపారు.

ఎన్టీఆర్ ట్రస్ట్‌కు విరాళం



నారా భువనేశ్వరికి విరాళం చెక్కును అందజేస్తున్న వంకాయలపాటి హరిబాబు

బాపట్లరూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ట్రస్ట్‌కు 25 వేల రూపాయల విరాళం చెక్కును గురువారం ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరికు ఎన్టీఆర్ క్లబ్ మెంబరు, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ఉద్యోగి వంకాలయపాటి హరిబాబు అందజేశారు.

మత్స్యకారుల సీఎంజెడ్ సమస్యలను పరిష్కరించాలి



గ్రామసభలో ఆర్డీవోకు అర్జీని అందజేస్తున్న రామచంద్రపురం మత్స్యకారులు

బాపట్లరూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం అడవిపంచాయతీ రామచంద్రపురం గ్రామ మత్స్యకారుల సీఎంజెడ్ సమస్యలను పరిష్కరించాలని గురువారం నిర్వహించిన గ్రామసభలో బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియాకు అర్జీ పత్రాన్ని మత్స్యకారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల తహసీల్దార్ సలీమా, అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్, సీపీఐ బాపట్ల నాయకులు జేబీ శ్రీధర్, బీఎస్పీ నాయకులు రాజారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

● తెలుగుమహిళ మండల అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ

బాపట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని తెలుగుమహిళ మండల అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ తెలిపారు. మండలంలోని ఈతేరు గ్రామంలో హిందు శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మాణానికి గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారన్నారు. నిధులు దారి మళ్లించి గ్రామాల వైపు చూడలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామస్థాయి నుంచి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎస్సీ, బీసీ, ఓసీలకు సంబంధించిన శ్మశానం చుట్టూ ప్రహరీ నిర్మించటం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నె సాంబయ్య, అందేపోలు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, కనపర్తి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

9న శ్రీఆంజనేయ హోమర్చాన

బాపట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సూర్యలంక రోడ్డులో కోన ప్రభాకర రావు కళాక్షేత్రం నందు ఈనెల 9వ తేది ఆదివారం శ్రీఆంజనేయ మూలమంత్రోక్త నవ కుండాత్మక నవగ్రహ దివ్యానుగ్రహ హోమార్చన జరుగుతుందని శ్రీలలిత త్రిపురసుందరి పీఠం నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు తెలిపారు. సర్వమానవాళి శ్రేయస్సును ఆకాంక్షిస్తూ బాపట్లలో మొదటిసారిగా నిర్వహించే ఈ కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

జూదరుల అరెస్టు

కొల్లూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు. గురువారం కొల్లూరులోని జగనన్న కాలనీలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ తన సిబ్బందితో పేకాట స్థావరంపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాడుల్లో 8 మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.9700 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులను కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుల దూషణపై కేసు

వేమూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కుల దూషణపై వేమూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఎస్ఐ రవికృష్ణ తెలిపారు. వివరాల ప్రకారం.. చదలవాడ గ్రామానికి చెందిన గుంటూరు విజయకుమారిని చక్రాయపాలెం గ్రామానికి చెందిన నిశ్శంకరరావు ఉమాశంకర్ కులం పేరుతో దూషిస్తున్నారని ఆమె ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికృష్ణ తెలిపారు.

విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధం

రేపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో నిజాం పట్నం మండలం నక్షత్రగనర్ గ్రామానికి చెందిన మోపిదేవి నాగరాజు పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా హుటాహుటిన వచ్చి మంటలను అదుపుచేశారు. సుమారు రూ.70వేలకు పైనే ఆస్తినష్టం ఉండవచ్చని అధికారులు తెలిపారు.

ప్రారంభానికి నోచుకోని మరుగుదొడ్లు

- లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మాణం
- ఇబ్బందులు పడుతున్న కూరగాయల రైతులు
- బస్టాండ్, రైల్వేస్టేషన్‌ను ఆశ్రయిస్తున్న తీరు

రేపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పెద్దకూరగాయల మార్కెట్‌వద్ద లక్షలాది రూపాయలను వెచ్చించి పురపాలక సంఘం ఆధ్వర్యంలో మరుగుదొడ్లు నిర్మించారే గానీ నేటికీ ప్రారంభించకపోవడంతో మార్కెట్‌కు వచ్చే కూరగాయల వ్యాపారులు నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛభారత్ స్వచ్ఛాంధ్రప్రదేశ్ సదాస్ పబ్లిక్ టాయిలెట్స్ బాత్‌రూమ్స్‌ను కూరగాయల వ్యాపారులకు రైతులకు ఉపయోగపడే విధంగా గత ప్రభుత్వంలో నిర్మించారు. నేటికి వాటిని వాడుకలోకి తీసుకురాకపోవటంతో చుట్టుప్రక్కల గ్రామాల నుంచి కూరగాయలు తీసుకువచ్చే రైతులు అర్ధరాత్రికి మార్కెట్‌కు చేరుకుంటారు. తెల్లవారుజామున కూరగాయల పాటలు పెట్టి అమ్మకాలు జరిపి తిరిగి గ్రామాలకు వెళతుంటారు. ఈ క్రమంలో మరుగుదొడ్లు లేక బస్టాండ్, రైల్వేస్టేషన్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉందంటూ రైతులు చుట్టుపక్కల వ్యాపారులు ఆరోపిస్తున్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు దృష్టిసారించి నిర్మించిన మరుగుదొడ్లను వాడుకలో కి తేవాలని కోరుతున్నారు.



కూరగాయల మార్కెట్‌వద్ద నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు



కూరగాయల మార్కెట్

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

● అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్



ఆయుధాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్

బాపట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ పేర్కొన్నారు. ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినులతో కలిసి అడిషనల్ ఎస్పీ ప్రారంభించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రాముఖ్యాన్ని విద్యార్థినులకు ఆయన వివరించారు. భద్రతా చర్యల్లో భాగంగా పోలీసు శాఖ వినియోగించే పరికరాలు, ఆయుధాలు గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. డ్రోన్ ఎగురవేసి అది పనిచేసే విధానం, పోలీసుశాఖకు ఏవిధంగా ఉపయోగపడుతుందనే విషయాలను విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ పాఠశాలలు, కళాశాలలు నుంచి విద్యార్థినులు హాజరయ్యారు. మహిళలకు రక్షణ, భద్రత కల్పించేందుకు పోలీసుశాఖ తీసుకుంటున్న చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన ఫోన్‌నెంబర్లు తెలియజేశారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, పోలీసుహెల్ప్‌లైన్ 112, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 గురించి వివరించారు. విధి నిర్వహణలో పోలీసులు వినియోగిస్తున్న వివిధ రకాల ఆయుధాలు, తుపాకులు, బాంబ్ డిస్పోజ్‌లు పరికరాలు, పోలీసుడాగ్స్, డ్రోన్స్, సాంకేతికత, బాడీవోర్న్ కెమెరాలు, కమ్యూనికేషన్ విభాగాలలో వినియోగిస్తున్న పరికరాలు గురించి, నేరస్థల పరిశీలనలో క్లూస్‌టీమ్ ఆధారాలు, ఫింగర్ ప్రింట్ సేకరించటాన్ని తెలియజేశారు. పోలీసుశాఖపై విద్యార్థినుల్లో ఆసక్తి పెంచేందుకు మహిళా ఇన్‌స్పెక్టర్‌లు పోలీసు యూనిఫామ్స్ వేసుకొని బాలికల వద్ద నిలబడి ఫొటోలు తీసుకునే ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రామాంజనేయులు, ఏఆర్‌డీఎస్పీ విజయసారధి, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, మహిళా పీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, బాపట్ల పట్టణ, రూరల్, సర్కిల్ సీఐలు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోపై చర్యలకు మీన మేషాలు

అమృతలూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : అడిగిన లంచం ఇవ్వలేదని పట్టాదారుడి పాసు పుస్తకం విసిరికొట్టిన వీఆర్వోపై చర్యలకు అధికారులు మీనమేషాలు లెక్కించడంపై బాధితురాలు విస్మయం వ్యక్త పరుస్తున్నారు. మండలపరిధిలోని మోపర్రుకు చెందిన ఆలపాటి శివకుమారి తనకు చెందిన 0.24న్నర సెంట్లు వ్యవసాయభూమికి శిస్తు చెల్లించే నిమ్మిత్తం మోపర్రు వీఆర్వో కార్యాలయానికి వెళ్లింది. అయితే పాసు పుస్తకం మంజూరునకు గతంలో తాను డిమాండ్ చేసిన లంచం ఇవ్వలేదంటూ తన పాసు పుస్తకంను వీఆర్వో కిషోర్ నేలకేసి కొట్టి తనపై ఆగ్రహం వ్యక్త పరిచాడని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ కథనం ఆంధ్రజ్యోతిలో ఈనెల 2వ తేదీన ప్రచురితమైన సంగతి విదితమే. దీనిపై స్థానిక తహసీల్దార్ శివకుమారిని తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి విచారణ చేశారు. విచారణలో బాధితురాలు జరిగిన సంఘటనపై పూర్తి వివరణ ఇచ్చినా ఇంతవరకు సదరు వీఆర్వోపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో కూడా అవినీతి అధికారులకు కొమ్ము కాస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై జిల్లా అధికారులు వెంటనే స్పందించాలని ఆమె కోరారు.

మున్సిపల్ అధికారుల విస్తృత దాడులు

● 1500కిలోల ప్లాస్టిక్ స్వాధీనం



మున్సిపల్ అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు, వస్తువులు

బాపట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పట్టణంలో మున్సిపల్ అధికారులు గురువారం విస్తృత దాడులు నిర్వహించారు. ప్లాస్టిక్ విక్రయించే దుకాణాలపై, వ్యాపార సముదాయాలపై కమిషనర్ జి.రఘునాదరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేశారు. గడియార స్తంభం వద్ద హోల్‌సేల్ దుకాణాల నందు నిర్వహించిన దాడుల్లో అత్యధికంగా 1500కిలోల ప్లాస్టిక్ దొరికింది. దీనిని స్వాధీనం చేసుకొని మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. ఈ విషయమై కమిషనర్ మాట్లాడుతూ పట్టణపరిధిలోని వ్యాపారులు ఇకపై ప్లాస్టిక్ వినియోగిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. పర్యావరణానికి హాని తలపెట్టే ప్లాస్టిక్‌ను అందరం స్వచ్ఛందంగా నిషేదించాలన్నారు. దీనికి వ్యాపారులంతా సహకరించి ప్లాస్టిక్ రహిత బాపట్లగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. ఇకపై ప్లాస్టిక్‌ను మరోమారు వినియోగిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. తనిఖీలు నిర్వహించిన వారిలో శానిటరి ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.కరుణ, డి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

● ఎంపీడీవో వెంకటరమణ

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటరమణ గురువారం తెలిపారు. మండల పరిధిలోని స్వయం ఉపాధి యూనిట్ ఏర్పాటు చేసుకుని ఆశావహులు రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. బీసీ, బీసీ-ఏ, (రజక, నాయీబ్రాహ్మణ) బీసీ-బీ (గౌడ, పద్మశాలీ), బీసీ-డీ (యాదవ), ఈబీసీ కులాలు రెడ్డి, కమ్మ, ఆర్య వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు సామాజిక వర్గాల వారు రాయితీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎమ్మెల్సీ కోడ్ అమల్లో ఉన్నందున జనవరిలో జరగాల్సిన ప్రక్రియ తాత్కాలికంగా నిలిపివేశారని, ఈ నెల 7నుంచి ఎన్నికల కోడ్ తొలగడంతో మళ్లీ బీసీ కార్పొరేషన్ వారు అందించిన సమాచారం మేరకు బీసీ రుణాల మంజూరుకు దరఖాస్తులు కోరుతున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. బీసీ, ఈబీసీ మహిళలకు స్వయం ఉపాధి కోసం బీసీ కార్పొరేషన్ ద్వారా ఉచిత కుట్టు శిక్షణ, శిక్షణ అనంతరం కుట్టుమిషన్లు ప్రభుత్వం అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు కూడా కుట్టుశిక్షణకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. 18-50 సంవత్సరాల మధ్య వయసు గల మహిళలు అర్హులుగా చెప్పారు. శిక్షణ కార్యక్రమం 90 రోజులు ఉంటుందని, ఒక ప్రాంతం నుంచి 50 కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే ఆ ప్రాంతంలోనే కుట్టుశిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తామని ఎంపీడీవో తెలిపారు. మండల గ్రామాల ప్రజలు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందంజ



కొల్లూరు పోస్టాఫీసులో మహిళా ఉద్యోగులను సత్కరించిన పోస్టుమాస్టర్లు, సిబ్బంది

కొల్లూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని రేపల్లె పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కే ఏడుకొండలు పేర్కొన్నారు. గురువారం కొల్లూరులోని తపాలాశాఖ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పోస్టుమాస్టర్ పి.సాయిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏడుకొండలు మాట్లాడుతూ పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారి సేవలను కొనియాడారు. అనంతరం ఐదుగురు ఉద్యోగినులను సత్కరించారు. మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో తపాలాశాఖ సిబ్బంది టి.రవికుమార్, కె.శ్రీను పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలలో..

అంగన్‌వాడీ కేంద్రాల్లో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని సూపర్‌వైజర్ విజయలక్ష్మి నిర్వహించారు. గురువారం కొల్లూరులోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల పరిధిలో మహిళా లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి మహిళా దినోత్సవ ప్రాముఖ్యాన్ని వివరించారు. అనంతరం ప్రభుత్వం ద్వారా సరఫరా అవుతున్న పౌష్టికాహార పదార్థాలు లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

ఆలపాటికి టీడీపీ నాయకుల అభినందలు



ఎమ్మెల్సీ ఆలపాటికి అభినందనలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

అమృతలూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. గుంటూరులో ఆయన కార్యాలయంలో కలసి ఆలపాటిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో యలవర్తి బ్రహ్మానందం, శరణుగిరి, తుమ్మల భుజంగరావు, మట్లపూడి జయపాల్, బొంతా ఆంజనేయులు, క్రొత్తపల్లి రవీంద్రబాబు, కొసరాజు దేవకుమార్, శ్రీను, యలమంచిలి జగన్మోహనరావు, బెనర్జీ, పావులూరి హేమచంద్ తదితరులున్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి

● పశువైద్యాధికారి డాక్టర్ ఎం కిరణ్



పడ్డదూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది, పశువైద్యాధికారి ఎం కిరణ్

పిట్టలవానిపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈనెల 1 నుంచి 31వ తేదీ వరకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తారని మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం కిరణ్ అన్నారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తారని అన్నారు. వ్యాధి సోకక ముందే టీకాయిలు వేయించుకుంటే పశువులు ఆరోగ్యంగా ఉంటాయని తెలిపారు.

పడ్డదూడలకు బ్రూసెల్లోసిస్ టీకాలు

మండలంలో ఈనెల 1 నుంచి 31వ తేదీ వరకు ప్రతి గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆదేశాల మేరకు మూడునెలలు పైబడిన పడ్డదూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి టీకాలు ఉచితంగా వేస్తామని మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం కిరణ్ అన్నారు. ఈవ్యాధి సోకిన పడ్డదూడల్లో చూడైన 7 నుంచి 9 నెలల్లోపు గర్భస్రావం జరుగుతుందని తద్వారా పశుపోషకులకు అధిక నష్టం జరుగుతుందని, ఈటీకాలను ఒకసారి పడ్డదూడలకు వేసినట్లైతే జీవితాంతం వ్యాధి నిరోధక శక్తిని కలిగి ఉంటాయన్నారు.

హిందువులపై ఏకపక్ష దాడులను ఖండిస్తున్నాం

● హిందూ చైతన్య వేదిక సభ్యులు

బాపట్లరూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): హిందువుల మీద జరుగుతున్న ఏకపక్ష దాడులను ఖండిస్తున్నామని హిందుచైతన్యవేదిక బాపట్ల సభ్యులు తెలిపారు. గురువారం బాపట్ల భావన్నారాయణస్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా రాయచోటిలో వీరభద్రస్వామి పార్వేట ఉత్సవంలో ముస్లింలు అకస్మాత్తుగా జొరబడి దాడులు చేసి మసీదులోకి పారిపోవటం అది కూడా పోలీసుల సాక్షిగా జరగడం దారుణమన్నారు. పోలీసుల మీదకు కూడా దాడులకు తెగపడ్డారని వారి దాడుల వెనుక ఎవరు ఉన్నారనేది విచారణ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులకు స్థానిక ప్రభుత్వ యంత్రాగానికి సహకరించిన హిందువుల మీదే బలమైన కేసులు పెట్టి ఇంత అల్లరికి కారణమైన పోలీసుల మీద దాడి చేసిన ముస్లింల మీద నామమాత్రపు కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ దాడికి కారణమైన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంయోజక ఉల్లగంటి శ్రీనివాస్, మద్దుల వెంకటేశ్వర్లు, బండారు జ్వాల నరసింహం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హిందూచైతన్యవేదిక సభ్యులు

మల్ల యుద్ధ యోధుడు శ్రీవల్లి శివకుమార్‌కి ఘన సత్కారం



శ్రీవల్లి శివకుమార్‌ను సత్కరిస్తున్న సాహితిభారతి రచయితలు

బాపట్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రాచీన భారత యుద్ధ విద్యలైన కర్రసాము, కత్తిసాము, మల్లయుద్ధం వంటి విద్యలు ఎంతో మంది విద్యార్థులకు, యువకులకు ఉచితంగా నేర్పిన ఘనత మల్లయుద్ధ యోధుడు శ్రీవల్లి శివకుమార్‌దేనని పలువురికి ఆదర్శప్రాయుడిగా నిలిచాడని సాహితీభారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ అన్నారు. గురువారం మల యుద్ధయోధులు శ్రీవల్లి శివకుమార్‌ను సాహితీభారతి రచయితలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాహితిభారతి కోశాధికారి ఆదం షఫి మాట్లాడుతూ ప్రముఖ నటులైన ఎన్టీఆర్, శివాజి గణేషన్, కన్నడ రాజ్‌కుమార్ వంటి వారికి కత్తిసాము నేర్పిన ఘనత శ్రీవల్లి శివకుమార్ కే దక్కిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శామ్యూల్, మస్తాన్‌రెడ్డి, కాళీదాసు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి త

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారుల కుటుంబసభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గురువారం పంపిణీ చేశారు. మండల పరిధిలోని కోనేటిపురం గ్రామానికి చెందిన జంపని శ్రీనివాసరావు, ఆళ్లమూడి గ్రామానికి చెందిన రాజులపటి నాంచారయ్య, ఐలవరం గ్రా మానికి చెందిన బట్టు కమల పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. వైద్య ఖర్చుల నిమిత్తంగా ఎమ్మెల్యేను సంప్రదించి తమను ఆదుకోవాలని కోరగా ముఖ్యమంత్రి సహాయ నిధికి రిఫరెన్స్ లెటర్ పంపారు. అనంతరం సీఎంఆర్ఎఫ్ కార్యాలయం నుంచి జంపని శ్రీనివాసరావుకు రూ. 1,02,400లు, రాజులపాటి నాం చారయ్యకు రూ.52,682లు, బట్టు కమలకు రూ.23,920లు వచ్చిన చెక్కులు మొత్తం రూ.1,79,002లు మంజూరు కాగా ఎమ్మెల్యే గుంటూరు క్యాంపు కార్యాలయంలో వాటిని లబ్ధిదారుల కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధి దారులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

● జనసేనపార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్రాణం మార్కండేయులు



సభలో మాట్లాడుతున్న జనసేనపార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్రాణం మార్కండేయులు

బాపట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జనసేనపార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్రాణం మార్కండేయులు పిలుపునిచ్చారు. పట్టణంలోని బీఆర్ అంబేద్కర్ భవన్‌లో గురువారం జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ అధ్యక్షతన సన్నాహక సభ నిర్వహించారు. సభకు మార్కండేయులు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన పిఠాపురంలో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో 12వ ఆవిర్భావ దినోత్సవ సభ జరుగుతుందన్నారు. నియోజకవర్గం నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారి, జనసైనికులు, వీరమహిళలు, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి టీ వెంకటేశ్వర్లు

రేపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వివిధ కేసులను సత్వరమే పరిష్కరించేందుకు జాతీయ లోక్‌అదాలత్ ఉపయోగపడుతుందని సీనియర్ సివిల్ జడ్జి మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ టి.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక కోర్టు ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2వ శనివారం 8వతేదీ జాతీయ లోక్‌అదాలత్‌ను ఏర్పాటు చేస్తున్నామని వీటిల్లో సివిల్, క్రిమినల్ కేసులు ప్రీ లిటికేషన్ కేసులు పరిష్కరిస్తారని తెలిపారు. లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాల్సిందిగా న్యాయవాదులను కక్షదారులను కోరారు. సమావేశంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

సఖి వన్‌స్టాప్ సెంటర్ ద్వారా మహిళలకు భద్రత

● సునీల్‌గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ పేరలి సునీల్‌కుమార్



సఖివన్ స్టాప్ సెంటర్ గురించి వివరిస్తున్న పేరలి సునీల్‌కుమార్

బాపట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సఖి వన్‌స్టాప్ సెంటర్ ద్వారా మహిళలకు భద్రత చేకూరుతుందని సునీల్‌గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ పేరలి సునీల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని రామకృష్ణాపురం పీఎస్‌కే నర్సింగ్ కళాశాలలో గురువారం సఖివన్‌స్టాప్ సెంటర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సునీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజంలో ఎవరైతే బాధిత మహిళలు ఉన్నారో వారు సఖివన్‌స్టాప్ సెంటర్ ద్వారా న్యాయం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో లీగల్ కౌన్సిలర్ శిరీషా, బేబి, సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఉషారాణి, సిబ్బంది సుష్మా, అంజమ్మ, వాసంతి, రత్నాకర్, నర్సింగ్ విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

● బీఎస్ఎస్ఎఫ్ ప్రతినిధి రవికిరణ్



టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందిస్తున్న రవికిరణ్, ఉపాధ్యాయులు

రేపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి కష్టపడి చదివి పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని హైదరాబాద్‌కు చెందిన బీఎస్ఎస్ఎఫ్ ప్రతినిధి రవికిరణ్ అన్నారు. గురువారం లంకేవానిదిబ్బ జడ్పీ ఉన్నత పాఠశాల బొబ్బర్లంక జడ్పీ ఉన్నత పాఠశాల, పలు పాఠశాలల్లో పదో తరతగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్ఎస్ఎఫ్ హైదరాబాద్‌కు చెందిన బసవరాజు శ్రీనివాసరావు విద్యార్థులకు పరీక్ష మెటీరియల్‌ను అందించారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషగిరిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగా అన్నారు. గురువారం పట్టణంలోని షిరిడీసాయి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆదర్శవేదిక ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష మెటీరియల్‌ను ఆమె అందజేశారు.

ఎకోటూరిజం.. ఎంజాయ్ చేద్దాం!


బాపట్ల మండలం సూర్యలంక తీరానికి సమీపంలో ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుచేసిన ఎకోటూరిజం ప్రధానద్వారం


ఎకో టూరిజంలోని పర్యాటకులు తిరిగేందుకు ఏర్పాటుచేసిన సైకిళ్ళు


డార్మెటరీలోని బెడ్‌లు


ఎకో టూరిజంలోని కాటేజీలు


ఆహ్లాదకరమైన వాతావరణంలో మినీ ఫంక్షన్‌గ్రౌండ్

- పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ఏర్పాట్లు
- మరింత అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- నిధులు రాగానే అధునాతన సౌకర్యాలు

బాపట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్ర తీరంలో ఎకోటూరిజంను అత్యంత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. కాటేజిల చుట్టూ 45 రకాల మొక్కలు పెంచుతున్నారు. వేసవిలో కూడా చల్లటి వాతావరణంలో ప్రకృతిని ఆస్వాదిస్తూ కాటేజిలలో సరదాగా గడిపేందుకు ఏర్పాట్లు చేశారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఎకోటూరిజంనకు ఆ తర్వాత వైసీపీ పాలనలో ఆదరణ కరవైంది. దీని అభివృద్ధిని గాలికి వదిలేశారు. మొక్కుబడిగా నిర్వహిస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై మళ్లీ దృష్టిసారించింది. ఎకోటూరిజంలో 6 కాటేజిలు, ఒక డార్మెటరి, రెస్టారెంట్, వాటర్‌ప్లాంట్ ఉన్నాయి. ప్రస్తుతం మరో 6 కాటేజిలు అత్యాధునికంగా ఏర్పాటు చేస్తున్నారు. వీటితో మొత్తం 12 కాటేజిలు ఒక డార్మెటరి ఉంటాయి. జీడిమామిడి తోటల మధ్య 45 రకాల చెట్లు, మొక్కల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో చూడముచ్చటగా ఉన్న కాటేజిలలో సేద తీరేందుకు దూరప్రాంతాల నుంచి ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకొని పర్యాటకులు వస్తున్నారు. సూర్యలంక నేచర్ క్యాంపు రిసార్ట్స్‌గా ఏర్పాటు చేసిన ఎకోటూరిజంలో బీచ్ సఫారి, సైకిల్ సఫారి సదుపాయం కల్పించారు.

కాటేజిల ధరలు ఇలా..

సూర్యలంక తీరంలోని ఎకోటూరిజం కాటేజిలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలి. ఉదయం 10 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 9గంటల వరకు ఒకరోజుగా పరిగణిస్తారు. సోమవారం నుంచి గురువారం వరకు కాటేజికి రూ. 3,265 చెల్లించాలి. శుక్రవారం నుంచి ఆదివారం వరకు రూ. 3,592 చెల్లించాలి. డార్మెటరిలో 6 బెడ్‌లు ఉంటాయి. దీనికి రూ.4,816 చెల్లించాలి. ఎక్స్‌ట్రా బెడ్‌కు విడి రోజుల్లో రూ. 998, వీకెండ్‌లో రూ. 1098 చెల్లించాలి. చిన్నచిన్న ఫంక్షన్లు, పార్టీలు, ఫొటోషూట్‌లు తీసుకునే అవకాశం కల్పిస్తున్నారు.

అభివృద్ధి వైపు అడుగులు

సముద్రానికి కొంత దూరంగా ఎకోటూరిజం ఉండటం వల్ల పర్యాటకుల ఆదరణ తక్కువగానే ఉంది. సముద్రం ఎదురుగా ఉండే కాటేజిలకే ఆదరణ ఎక్కువగా ఉంది. అయితే ఇక్కడపచ్చటి మొక్కలు, చెట్లు, ఆహ్లాదాన్ని పంచేవిధంగా ఉన్నాయి. ఆరోగ్యానికి ఉపయోగపడే ప్రకృతి మధ్య ఉండాలనుకునేవారు ఎక్కువగా ఇక్కడకు వస్తుంటారు. సముద్రాన్ని సందర్శించిన తర్వాత ఇక్కడకు వచ్చి మంచి నీటితో స్నానాలు చేసి సేద తీరే అవకాశం ఉంది. కనుక ప్రభుత్వం దీనిని మరింతగా అభివృద్ధి చేసేందుకు అడుగులు వేస్తుంది.

టూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు చేశాం

ఎకోటూరిజం మరింత అభివృద్ధి చేసేందుకు అనేక ప్రతిపాదనలు చేశాం. ఇక్కడ సేద తీరే పర్యాటకులు సముద్రానికి వెళ్లేందుకు ఒక వాహనం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాం. చిల్డ్రన్స్ పార్క్ అభివృద్ధి, గ్రీనరీ డెవలప్‌మెంట్, మినీథియేటర్ సౌకర్యంతోపాటు కాటేజిలు పెంచే ఆలోచన చేస్తున్నాం. దీనికి సంబంధించి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే అన్నిరకాల వసతులతో పర్యాటకులకు ఆహ్లాదకరమైన మరిన్ని కాటేజిలు అందుబాటులోకి తెస్తాం.

- ఎ.గీతిక, ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డివిజన్ మేనేజర్


కాటేజీల ఎదుట ఆహ్లాదకరమైన ప్రాంతం

ఆకాశం ఎందుకో ఎర్రబడ్డది...




ఆకాశం ఎరుపెక్కింది. గురువారం సాయంత్రం వేళ తెనాలిలో కనిపించిన దృశ్యమిది. బుర్రిపాలెం రోడ్డులో సాయంత్ర వేళ వాకింగ్‌కు వెళ్లే వారికి కనిపించిన ఈ దృశ్యం ఆకట్టుకుంది. పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలకు ఈ చిత్రం అద్దం పడుతోంది.

- తెనాలి అర్బన్ (ఆంధ్రజ్యోతి)

ప్రాణాలతో చెలగాటం!

అది ఎప్పుడో మూసి వేసిన రైల్వే గేటు... అయినా అక్కడ నుంచి నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తూనే ఉన్నారు... గేటుకు ఇరువైపులా గోడకట్టి రైల్వేశాఖ మూసి వేసినా దాన్ని ధ్వంసం చేసి మరీ రాకపోకలు సాగిస్తున్నారు. దీనికితోడు ఒక్కోసారి ఇక్కడ ఉన్న గూడ్స్ రైలు కింద నుంచి దూరి వెళ్తూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. స్థానిక బ్రాడీపేట 14వ అడ్డరోడ్డు వద్ద నిత్యం ఇదో తంతుగా మారింది. స్టేషన్‌లో ప్లాట్‌ఫారాలు ఖాళీ లేని సమయం, సిగ్నల్ ఇవ్వని సందర్భంలో బ్రాడీపేట 14వ అడ్డరోడ్డు పాత రైల్వేగేటు వద్ద రైళ్లు, గూడ్స్ వ్యాగన్లు నిలిచిపోతాయి. ఆ సమయంలో అవి వెళ్లేదాక ఆగకుండా వాటి కింద నుంచి దూరి వెళ్తున్నారు. అంతేకాదు సైకిళ్లను కూడా తమ వెంట తీసుకెళ్తూ కొంతమంది విద్యార్థులు రైలు పట్టాలపై ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

- గుంటూరు(ఆంధ్రజ్యోతి)


గూడ్స్ రైలు కింద నుంచి సైకిల్‌తో సహా వెళ్తున్న విద్యార్థులు


గూడ్స్ రైలు కింద నుంచి వెళ్తున్న యువకులు


ఆగి ఉన్న గూడ్స్ ట్యాంకర్ మధ్య నుంచి వెళ్తున్న విద్యార్థి

ఎల్లవేళలా దయాక్షేత్రంపై ఏసయ్య కరుణ


భక్తి గీతాలు ఆలపిస్తున్న అబ్రహం, జాన్ వెస్లీ రమేష్, పైడిపాల్

- పాస్టర్ జాషువా మోజెస్
- లేమల్లెలో 48వ గుడారాల పండగ ప్రారంభం
- లక్షలాదిగా తరలివచ్చిన దైవజనులు, విశ్వాసులు


పండుగలో పాల్గొన్న సిస్టర్స్, విశ్వాసులు


హోసన్న గుడారాల పండుగను ప్రారంభిస్తున్న పాస్టర్ జాషువా మోజెస్, అబ్రహం, జాన్ వెస్లీ తదితరులు

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా అమరావతి మండలం లేమల్లె గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన దయాక్షేత్రంలో గురువారం సాయంత్రం 48వ గుడారాల పండగ దైవజనుల, విశ్వాసుల సమక్షంలో ప్రభువు ఆశీస్సులతో ప్రారంభమైంది. పండగను దక్షిణ ఆఫ్రికాకు చెందిన పాస్టర్ జాషువా మోజెస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ముందుగా దైవ సందేశాన్ని చదివి ఏసుక్రీస్తు ఆశీస్సులు, కరుణ దయాక్షేత్రం పండగలో పాల్గొన్న దైవజనులు, విశ్వాసులపై ఉండాలని ప్రార్థించారు. ప్రారంభ కార్యక్రమంలో హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, రమేష్, పైడిపాల్, అనిల్, రాజుతో పాటు దైవజనులు పాల్గొని బెలూన్స్, పావురాళ్లను ఎగురవేశారు. అనంతరం దయాక్షేత్రం పుస్తకాన్ని అమెరికాకు చెందిన పాస్టర్ హెర్నిస్ట్ పాల్ ఆవిష్కరించారు. దయాక్షేత్రం పాటల సీడీని మదనపల్లికి చెందిన పాస్టర్ రాజశేఖర్ ఆవిష్కరించారు. కార్యక్రమాల ప్రారంభంలో హోసన్న జయమే.. జయం మనకే, ఏసయ్య నా ప్రాణమే.. అనే గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో పాల్గొన్న విశ్వాసులు ఏసయ్యకు స్తోత్రాలు పలుకుతూ భక్తి సాగరంలో మునిగారు. ప్రారంభ కార్యక్రమానికి ముందు అబ్రహం మాట్లాడుతూ దయాక్షేత్రంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ దేవుని కరుణ ఉండాలని అన్నారు. పండగ జరిగే 4 రోజులు పక్కనున్న విశ్వాసుల కన్నా దేవునితో మాట్లాడుతూ ఉండాలని అన్నారు. పాస్టర్ జాషువా మోజేస్ మాట్లాడుతూ దయాక్షేత్రంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ చేతులు ఆకాశం వైపు చూపిస్తున్నాయని ప్రభువు ఆశీస్సులు వారిపై ఉండాలని ప్రార్థిస్తున్నానని అన్నారు. దేశ విదేశాల నుంచి దైవజనులు పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు సమీప రాష్ట్రాల నుంచి విశ్వాసులు హాజరయ్యారు. ప్రారంభం రోజునే లక్షలాది మంది ప్రార్థనలో పాల్గొన్నారు. శుక్ర, శని వారాలలో ఉదయం, సాయంత్రం, ఆదివారం మధ్యాహ్నం జరిగే ప్రార్థనలతో పండగ ముగుస్తుంది.

మోతడకలో రెండు గంటలపాటు ట్రాఫిక్ జామ్

తాడికొండ (మోతడక) మార్చి 6(ఆంధ్రజ్యోతి): లేమల్లే గుడారాల పండగ ప్రార్థనలకు వెళ్తున్న వాహనదారులు రెండు గంటలకు పైగా ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయారు. గురువారం నుంచి పల్నాడు జిల్లా అమరావతి మండలం లేమల్లె గ్రామంలో నిర్వహిస్తున్న గుడారాల పండగ ప్రార్థనలకు భారీగా భక్తులు చేరుకుంటున్నారు. ఈక్రమంలో ఇతర జిల్లాల నుంచి భారీగా భక్తులు వాహనాల్లో తరలి రావటంతో తాడికొండ మండలం మోతడక గ్రామంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గుడారాల పండగ ప్రార్థనలకు వెళ్లే భక్తులకు ప్రధాన రహదారి అమరావతి రోడ్డు కావటంతో భారీగా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రెండు గంటలకు పైగా వాహనాలు నిలిచిపోవటంతో ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయటానికి పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది లేకపోవటంతో ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనదారులే ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసుకున్నారు. తాడికొండ సీఐ వాసును వివరణ కోరగా పక్క జిల్లాల్లో జరుగుతున్న గుడారాల పండగ ప్రార్థనలకు బందోబస్తు నిర్వహించటానికి తమకు ఎలాంటి ఆదేశాలు లేవని, ట్రాఫిక్ జామ్ విషయం తెలిసి ఎస్.ఐను సిబ్బందిని పంపించామని పేర్కొన్నారు.


మోతడకలో ట్రాఫిక్ జామ్‌తో నిలిచిపోయిన వాహనాలు

సహకారం.. సాంకేతికం

(7వ పేజీ తరువాయి)

వీలుంటుందనేది ప్రభుత్వ ఆలోచన. మరోవైపు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా లక్షన్నర ఖాతాలు ఆన్‌లైన్ కాగా వీటికి సంబంధించి వేల ఖాతాల్లో అక్రమాలు బయటపడినట్లు సమాచారం. వీటిపై చర్యల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు అధికారులు చెబుతున్నారు.

వాణిజ్యం.. సహకారం

ఇప్పటి వరకు సహకార సంఘాల పాత్ర రైతులకు పంట రుణాలు అందించడంతో పాటు అరకొరగా ధాన్యం సేకరణకు మాత్రమే పరిమితమయ్యేది. అంతంతమాత్రంగా ఉన్న సొసైటీల ఆర్థిక పరిస్థితి గత ప్రభుత్వం అవలంభించిన విధానాలతో పూర్తిగా గందరగోళంలో పడిపోయింది. ఈ క్రమంలో వాటిని తిరిగి పట్టాలెక్కించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంది. తొలుత పీఏసీఎస్‌ల డిజిటలైజేషన్ మీద దృష్టి పెట్టిన ప్రభుత్వం మలిదశలో వాటిని వాణిజ్యం వైపు నడిపించడానికి బృహత్తర ప్రణాళికలను తయారు చేసే విధంగా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని డీసీసీబీ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి సొసైటీలు చేయాల్సిన వ్యాపారాలను గుర్తించడంతో పాటు ఆసక్తి ఉన్న వారికి రుణాల మంజూరు ప్రక్రియను చేపట్టాల్సి ఉంటుంది. దీనిలో భాగంగా పెట్రోలు బంకులు, ఎరువుల వ్యాపారం, గోడౌన్ల నిర్మాణం, విలువ ఆధారిత ఉత్పత్తులు, కల్యాణ మండపాలు, బియ్యం తదితర వ్యాపారాలను గుర్తించి ఆ దిశగా పీఏసీఎస్‌లను మళ్లించడానికి అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటుంది. ఇప్పటి వరకు పంట రుణాలపై వచ్చే కమీషన్లపైనే సంఘాలు ఆధారపడేవి. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ద్వారా రుణాలపై నామమాత్రపు వడ్డీతో పాటు కొన్ని వ్యాపారాల్లో భాగస్వామ్యం కావడం ద్వారా పీఏసీఎస్‌ల ఆదాయం పెరగనుంది. తద్వారా సొసైటీలకు వచ్చే ఆదాయాన్ని తిరిగి రైతుల మేలు కోసం మరింతగా ఖర్చు పెట్టాలని నిర్ణయించింది. తద్వారా సహకార రంగాన్నే బలోపేతం చేసినట్లవుతుందనేది ప్రభుత్వ ఆలోచన. ఈ చర్యలతోపాటు త్వరలోనే ఎన్నికలు జరిపి పాలకవర్గాలను కొలువదీర్చాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

బర్లీ పొగాకు రైతులను ఆదుకోవాలి

చిలకలూరిపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకు రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు గురువారం కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో వివిధ పార్టీల, రైతు సంఘాల నాయకులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో డాక్టర్ కొల్లా మాట్లాడుతూ గత సంవత్సరం పొగాకు పంట ధరలు బాగా ఉండటంతో రైతులు విస్తారంగా బర్లీ పొగాకు సాగుచేశారని, ధరలేకపోవడంతో రైతులు నిండా మునిగిపోయారన్నారు. ప్రస్తుతం బర్లీ పొగాకును సరిగా కొనటం లేదన్నారు. గత సంవత్సరం మొదటి విరుపు అడుగు ఆకు కొట్టిన తర్వాత అమ్మితే క్వింటాకు రూ.8వేల నుంచి రూ.10వేల వరకు ధర లభించిందని, ఈ ఏడాది రూ.4, 5వేలకే ధర పరిమితమైందన్నారు. గత సంవత్సరం రెండో వలుపు, మూడో వలుపు పొగాకును రూ.15వేల నుంచి రూ.18వేలకు కొనుగోలు చేశారని గుర్తుచేశారు. ఈ ఏడాది రూ.10వేలకు కూడా కొనే నాథుడు కరువయ్యాడన్నారు. ఇటువంటి పరిస్థితులలో ప్రభుత్వం రైతులకు అండగా నిలబడి బర్లీ పొగాకు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎఫ్‌సీవీ వర్జీనియా పొగాకు ధరలను, విస్తీర్ణాన్ని పొగాకు బోర్డు నియంత్రిస్తుందని, అలాగే పొగాకు బోర్డు జోక్యం చేసుకొని బర్లీ పొగాకు పంట ధర పడిపోకుండా చూడాలని సూచించారు. కంపెనీల చేత మద్దతు ధరకు బర్లీ పొగాకు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పొగాకు రైతుల తరఫున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం రాధాకృష్ణ, రావు సుబ్రమణ్యం, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, షేక్ గౌస్, రైతు సంఘం నాయకులు కోలా నవజ్యోతి, చంద్ర కొండలరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.కోటేశ్వరరావు, కారుచోల స్వప్నకుమార్, ఉప్పాలబాబు, ఆర్ నర్సిరెడ్డి, ఇంటూరి భవాని వెంకటేష్, రైతు సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సాగరమాత మహోత్సవాలు

మాచర్ల రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురి సౌత్‌లో కృష్ణానది తీరాన ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం సాగరమాత ఆలయ మహోత్సవాలను ఈ నెల 7వ తేదీ నుంచి మూడు రోజులపాటు విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యాన అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. భారతీయ సంప్రదాయాలతో నిర్మించిన తొలి క్రైస్తవ మందిరంగా సాగరమాత ఆలయం పేరుగాంచింది. ధూప, దీప, నైవేద్యాలు, తలనీలాలు, మొక్కుబడులు చెల్లించుకునే కార్యక్రమాలన్నీ పూర్తిగా హిందూ పద్ధతిలో జరిగే క్రైస్తవ ఆలయమిది. ఉత్సవాలకు వేలాదిగా భక్తులు తరలిరానున్నారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు జరపనున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక ప్రార్థనల నిమిత్తం షామియానాలు, టెంట్లు ఏర్పాటు చేశారు. అలాగే భారీ జెయింట్ వీల్స్‌తో పలు స్టాల్స్ ఏర్పాటయ్యాయి.


ప్రాంగణంలో ఏర్పాటుచేసిన జెయింట్‌వీల్, స్టాల్స్


సాగరమాత ఆలయం



బండ్ల బాపయ్య కళాశాలను పరిశీలించిన ఏఎస్పీ విఠలేశ్వర్

అపరిచితులను గుర్తించండి

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

వేటపాలెం(చీరాల), మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పరీక్షా కేంద్రాల పరిసరాల్లో అపరిచితులను గుర్తించి అదుపులోకి తీసుకోవాలని అడిషనల్ ఎస్పీ టీవీ విఠలేశ్వర్ అన్నారు. ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు గురువారం వేటపాలెం మండల పరిధిలోని బండ్ల బాపయ్య జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయా పరిసరాల్లో బందోబస్తుపై ఆరా తీశారు. పరీక్షలు ప్రశంతంగా జరిగేలా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు, నిర్వాహకులను మాత్రమే అనుమతించాలని సూచించారు. ఇతరులపై జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. ఏఎస్పీ వెంట వేటపాలెం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

నేడు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఆదరణ-3 పథకంలో బీసీ కార్పొరేషన్ ద్వారా కులవృత్తిదారులకు వృత్తిపరమైన పరికరాలను అందించేందుకు ఏర్పాటుచేసే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో కులవృత్తి సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో లక్ష్మీనారాయణ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని కుల వృత్తిదారుల సంఘాల సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

మాలిక్యులర్ బయాలజీతో అవకాశాలు



విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న ప్రతినిధులు

చీరాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : బీఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులు మాలిక్యులర్ బయాలజీ వైపు దృష్టి సారించినట్లయితే ఉన్నత శిఖరాలను అందుకుంటారని చీరాల ఐకాన్ హాస్పిటల్ వైద్యుడు డా.కొండలరావు అన్నారు. సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఫార్మసీలో బీ ఫార్మసీ ఆఖరి సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులకు సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో వీడ్కోలు సభను నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. కొండలరావు పలు అభివృద్ధి మార్గాలు వివరించారు. ఫార్మారీసెర్చ వంటి వాటి ప్రయోజనాలు చెప్పారు. అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. వీవీ నాగేశ్వరరావు, డైరక్టర్ డా.సుబ్బారావు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.జగదీష్, మేనేజర్ రమణమూర్తి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి పీ-4 సర్వే

అద్దంకిటౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాలలో ఈనెల 8వ తేదీ నుంచి 18వ రకు పీ-4 సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బత్తిన సింగయ్య తెలిపారు. అట్టడుగున్న ఉన్న 20శాతం మంది పేదలను ఈ సర్వే ద్వారా గుర్తిస్తారని తెలిపారు. ఈ సర్వే రెండు దశలలో జరుగుతుందని, మొదటి దశలో ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న డేటా ఆధారంగా కొన్ని కుటుంబాలను గుర్తిస్తారన్నారు. సచివాలయ సిబ్బంది 27 అంశాలతో సర్వే చేస్తారన్నారు. ఇప్పటి వరకు బ్యాంక్ అకౌంట్ లేని, వంట గ్యాస్ లేని, పక్కా ఇల్లు, తాగునీరేఉ అందుబాటులో లేని కుటుంబాలను గుర్తించి నమోదు చేస్తారన్నారు. పేద కుటుంబాలకు అత్యధిక ఆదాయం కలిగిన 20శాతం కుటుంబాల సహాయ సహకారాలతో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తారని తెలిపారు. కుటుంబ అనుమతితోనే సర్వే చేస్తారని, 24వ తేదీలోపు గ్రామ సభల ఆమోదం తీసుకుంటామని చెప్పారు. ఉగాది నుంచి ఈ పథకం అమలులోకి వస్తుందని ఎంపీడీవో సింగయ్య తెలిపారు.

18 వతేదీ లోపు సర్వేని పూర్తి చేయాలి

మార్టూరు : పేదవారిని ఆర్థికంగా బలోపేతం చేయలనే ఉద్దేశంతో పీ-4 సర్వేను ప్రభుత్వం ఏర్పాటుచేసిందని, ఈ నెల 8వ తేదీ నుంచి 18 వవరకు సర్వేను పూర్తి చేయాలని ఎంపీడీవో వై.శ్రీనివాసరావు అన్నారు. గురువారం కార్యాలయంలో మండలంలోని గ్రామ సచివాలయ ద్యోగులకు పీ4 సర్వేపై శిక్షణ తరగతులను నిర్వహించారు. సర్వేను పారదర్శకంగా చేయాలని ఎంపీడీవో సూచించారు.

కారంచేడు (పర్చూరు) : పీ-4 సర్వేపై ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. 10 శాతం సంపన్నులు 20 శాతం అట్టడుగున ఉన్న పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు లబ్ధిదారుల గుర్తింపునకు సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నేతాజీ తెలిపారు. ఈనెల 8 నుంచి సర్వే ప్రారంభమవుతుందన్నారు.

అగ్నిగుండం కాదు.. సూర్యాస్తమయం



అద్దంకిలో గురువారం సాయంత్రం సూర్యాస్తమయం సమయంలో ఆకాశం ఎరుపెక్కి కనువిందు చేసింది. అద్దంకి పట్టణంలోని వేలమూరిపాడు రోడ్డులో సూర్యాస్తయంలో ఆకాశంలో ఈ దృశ్యం కనువిందు చేసింది.

- అద్దంకి, (ఆంధ్రజ్యోతి)

పర్యావరణ సంరక్షణ జాతీయ సభ్యుడిగా మస్తాన్‌వలి

తాళ్లూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పర్యావరణ సంర క్షణ జాతీయ సభ్యుడిగా తూర్పుగంగవరం వాసి నియ మితులయ్యారు. తూర్పుగంగవరం గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలి దక్కన్ క్లాప్ ఇండియాస్ ఫస్ట్ పెయిటింగ్ కమ్ వాటర్ ప్రూఫింగ్ సర్వీస్ కంపెనీని ఢిల్లీలో ఏర్పాటుచేశారు. ప్రముఖ కంపెనీగా జాతీయ స్థాయిలో అవార్డు దక్కించుకుంది. ఈఅవార్డును గురువారం ఢిల్లీలోని లీలా ప్యాలెస్‌లో మస్తాన్ వలి అందుకున్నారు.

శిథిలావస్థలో చరిత్ర కలిగిన దోబీఖానా

- దయనీయంగా నిర్వాహకుల పరిస్థితి
- కూటమి ప్రభుత్వ ప్రకటనపై హర్షం
- మరమ్మతులు చేపట్టి వాడకంలోకి తేవాలంటూ విజ్ఞప్తి

చీరాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల పురపాలక సంఘం పరిధిలోని 24వ వార్డు గాంధీనగర్‌లోని రజక సామాజికవర్గానికి చెందిన సుమారు 50 కుటుంబాలు ఆ ప్రాంతంలోనే ఉన్న దోబీఖానాపై ఆధారపడి జీవించేవారు. పట్టణమంతా వస్త్రాలను సేకరించి దోబీఖానాలో శుభ్రపరచి వివిధ శాఖల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు అందజేసి జీవనం సాగించే వారు. నిత్యం వస్త్రాల యజమానులతో రోజువారి పనులతో కళకళలాడే సుమారు 60 సంవత్సరాలు చరిత్ర కలిగిన దోబీఖానా నేడు దీన స్థితికి చేరింది. సుమారు నాలుగేళ్లుగా విద్యుత్ మోటారు, వినియోగంలో ఉన్న మోటు బావి మరమ్మతులకు గురి కాగా పట్టించుకోని పాలకులు, అధికారులు వైఫల్యంతో దానిపై ఆధారపడి జీవిస్తున్న రజక కుటుంబాల జీవన మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. దాదాపుగా యాభై కుటుంబాలు రోజువారీ విధివిధానాలతో వస్త్రాలను సేకరించి జీవనం సాగించేవారు. అయితే వినియోగంలోని దోబీఖానా మూతపడడంతో కుటుంబాలకు రోజు గడవడం కష్ట తరంగా మారింది. వృత్తిపరమైన వ్యవస్థలకు ఇప్పటికే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం కల్పిస్తుండడంతో దోబీఖానాను వాడకంలో తీసుకువచ్చి వారి భుక్తికి తోడ్పాటును అందించాలని ఆవర్గానికి చెందిన కుటుంబాలు వేడుకుంటున్నాయి.

గతంలో పలుమార్లు వినతులిచ్చాం



దోబీఖానా సమస్యను పరిష్కరించాలని గతంలో పలుమార్లు అధికారులకు వినతిపత్రాలను అందజేశాం. అయినా మా సమస్య పరిష్కారం కాలేదు. ఈక్రమంలో కుటుంబ పోషణ భారంగా మా రింది. టీడీపీ కూటమి ప్రభుత్వం కులవృత్తులను ఆదుకుం టామని ప్రకటించడం ఆనందకరం. వెంటనే దోబీఖానాను అందుబాటులోకి తీసుకొచ్చి రజకులకు సహకారం అందించాలి.


- చీదెళ్ల శ్రీనివాసరావు, రజకుడు



నిరుపయోగంగా ఉన్న దోబీఖానా



మరమ్మత్తులకు గురైన విద్యుత్ మోటారు



శిథిలావస్థకు చేరిన బావి

విషసర్పాలతో పొంచివున్న ప్రమాదం

గతంలో వందలమంది జనాభాతో కళకళలాడే దోబీఖానా మరమ్మతులకు గురి కావడంతో ఆ పరిసరాలు చిల్లచెట్లు, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. ఈక్రమంలో విషసర్పాలు సంచరిస్తున్నాయి. ఆ ప్రాంతంలో నివసించే ప్రజలు సైతం బెంబేలెత్తుతున్నారు. అంతేకాకుండా అసాంఘిక కార్యక్రమాలకు సైతం అడ్డాగా మారనుంది. ఈ నేపథ్యంలో దోబీఖానాను వెంటనే వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతయినా ఉందని స్థానికులు కోరుతున్నారు.

ప్రస్తుతం పనికి చాలా ఇబ్బంది



చాలా కాలంగా దోబీఖానా మూతపడింది. మా పూర్వీకుల కాలం నుంచి ఇక్కడే పనులు చేసుకుని జీవనం సాగించాం. కానీ ప్రస్తుతం దోబీఖానా మూతపడడంతో కుటుంబ పోషణకు ఇబ్బందిగా ఉంది. పాలకులు, అధికారులు మా గోడు పట్టించుకోవాలి.

- గొల్లపల్లి రమణయ్య, రజకుడు

కొటికలపూడిలో ఫాంపాండ్ల తనిఖీ

- రైతులు పథకాలను సద్వినియోగపర్చుకోవాలి
- డ్వామా పీడీ విజయలక్ష్మి



కొటికలపూడిలో పంట కుంట పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ విజయలక్ష్మి, ఏపీడీ కోటయ్య నాయక్ తదితరులు

అద్దంకిటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా అందిస్తున్న పలు రకాల పథకాలను సద్వినియోగపర్చుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డ్వామా పీడీ ఏవీ విజయలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని కొటికలపూడి గ్రామ పంచాయతీ పరిధిలో పంట కుంట పనులు చేస్తున్న ప్రాంతాన్ని ఆమె స్థానిక అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి జిల్లా పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న పనులను ఆకస్మిక తనిఖీ చేయాలనే సందేశాలను ఆయా జిల్లా పీడీలకు సీఆర్‌డీఏ అధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో గ్రామాలలో ఆకస్మికంగా తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో భాగంగా ఆమె కొటికలపూడి గ్రామ పంచాయతీ పరిధిలో పంట కుంట పనులను పరిశీలించారు. అక్కడ పనులకు వచ్చిన కూలీల హాజరును, ఫీల్డ్ అసిస్టెంట్ వేసిన హాజర్ మస్టర్‌ను తనిఖీ చేశారు. పనులు సక్రమంగా జరుగుతుండడం చూసి ఆనందించారు. ఉపాధి పనుల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని పీడీ సూచించారు. పనులుకు ఎక్కువ మంది కూలీలు వచ్చేలా చేయాలన్నారు. అలాగే రైతులు పంట కుంటల పథకాలను సద్వినియోపర్చుకోవాలని, రైతులకు అవగాహన కల్పించి పంట కుంటను ఎక్కువ తవ్వుకునేలా చూడాలని సూచించారు. పీడీ విజయలక్ష్మి వెంట ఏపీడీ కోటయ్య నాయక్, ప్లాంటేషన్ మేనేజర్ కిరణ్, టెక్నికల్ రిసోర్స్‌పర్సన్ మహేష్, ఏపీవో గాయత్రిదేవి, ఈసీఎం నాగరాజు, టీఏలు మురళీమనోహర్, కొండయ్య, నాగేశ్వరరావు, హనీష్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

బొబ్బేపల్లి కొండపై మంటలు

మార్టూరు, మార్చి6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొబ్బేపల్లి గ్రామానికి చెందిన ఫారెస్ట్‌కు చెందిన గ్రావెల్ కొండపై గురువారం రాత్రి మంటలు కనిపించాయి. కొండపై రెండు మూడు చోట్ల మంటలు కనిపించాయి. వేసవి కాలం కావడంతో ఈ మంటలు మరింతగా వ్యాప్తిచెందుతాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయం కావడంతో కొండపైకి వెళ్లే అవకాశం లేకపోవడంతో శుక్రవారం ఉదయం నాటికి కొం డపైకి వెళ్లి మంటలు ఉన్న ప్రదేశాలను పరిశీలిస్తామని సర్పంచ్ తాళ్లూరి లావణ్య, ఎంపీటీసీ సభ్యుడు దండా హరిబాబు, మాజీ సర్పంచ్ దండా వీరాంజనేయులు తదితర గ్రామస్థులు తెలిపారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు కావాలనే మంటలను రాజేశారా లేదా కాకతాళీయంగా మంటలు వ్యాపించాయా అన్న ఆలోచనలో వారు పడిపోయారు. ఈ విషయమై కూకట్లపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్‌బాబు మాట్లాడుతూ కొండపై మంటలు వ్యాపించడం తమ దృష్టికి వచ్చిందన్నారు. రాత్రి సమయం కావడంతో పరిశీలించలేమన్నారు. శుక్రవారం కొండపైన మంటలు రేగిన ప్రదేశాలను పరిశీలిస్తామన్నారు. కావాలనే ఎవరైనా వ్యక్తులు మంట పెట్టినట్లయితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

వేతనంతో కూడిన మెటర్నరీ లీవులు ఇవ్వాలి

చినగంజాం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఆశా కార్యకర్తలకు వేతనంతో కూడిన మెటర్నరీ సెలవులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తల యూనియన్(సీఐటీయూ) పిలుపు మేరకు గురువారం విజయవాడలో జరుగుతున్న ధర్నాకు సంఘీభావంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు పనిభారం, ధరల పెరుగుదలకు అనుగుణంగా వేతనం అందజేయాలని అన్నారు. వయో పరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని, ప్రభుత్వ సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, మట్టి ఖర్చులు, ఇన్సూరెన్స్ తదితర సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారన్నారు. నిరసన కార్యక్రమం అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ జె.ప్రభాకరరావుకు ఆశా కార్యకర్తలు అందజేవారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

10 నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

అద్దంకిటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు ఆర్థికంగా ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బీసీ, కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, ఆర్యవైశ్య, క్షత్రియ, ఈబీసీ సామాజిక వర్గాలకు చెందిన మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ ఇచ్చే కార్యక్రమం జరుగుతుందని ఆసక్తి ఉన్న మహిళలు సద్వినియోగపర్చుకోవాలని ఎంపీడీవో బత్తిన శింగయ్య గురువారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ నెల 10 నుంచి మండల కేంద్రంలో శిక్షణ ప్రారంభం అవుతుందని, 18 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళలు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డుతో సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌ను, పంచాయతీ కార్యదర్శిని, డిజిటల్ అసిస్టెంట్‌ను సంప్రదించి ఓబీఎంఎంఎస్ వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలం 45 రోజులు, 60 రోజులు, 90 రోజులు ఉంటుందని, శిక్షణలె 75శాతం హాజరు అ యినవారికి, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కుట్టుమిషన్ ఉచితంగా అందించడం జరుగుతందని తెలిపారు.

సహకారం.. సాంకేతికం

(7వ పేజీ తరువాయి)

వీలుంటుందనేది ప్రభుత్వ ఆలోచన. మరోవైపు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా లక్షన్నర ఖాతాలు ఆన్‌లైన్ కాగా వీటికి సంబంధించి వేల ఖాతాల్లో అక్రమాలు బయటపడినట్లు సమాచారం. వీటిపై చర్యల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు అధికారులు చెప్తున్నారు.

వాణిజ్యం.. సహకారం

ఇప్పటి వరకు సహకార సంఘాల పాత్ర రైతులకు పంట రుణాలు అందించడంతో పాటు అరకొరగా ధాన్యం సేకరణకు మాత్రమే పరిమితమయ్యేది. అంతంతమాత్రంగా ఉన్న సొసైటీల ఆర్థిక పరిస్థితి గత ప్రభుత్వం అవలంబించిన విధానాలతో పూర్తిగా గందరగోళంలో పడిపోయింది. ఈ క్రమంలో వాటిని తిరిగి పట్టాలెక్కించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంది. తొలుత పీఏసీఎస్‌ల డిజిటలైజేషన్ మీద దృష్టి పెట్టిన ప్రభుత్వం మలిదశలో వాటిని వాణిజ్యం వైపు నడిపించడానికి బృహత్తర ప్రణాళికలను తయారు చేసే విధంగా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని డీసీసీబీ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి సొసైటీలు చేయాల్సిన వ్యాపారాలను గుర్తించడంతో పాటు ఆసక్తి ఉన్న వారికి రుణాల మంజూరు ప్రక్రియను చేపట్టాల్సి ఉంటుంది. దీనిలో భాగంగా పెట్రోలు బంకులు, ఎరువుల వ్యాపారం, గోడౌన్ల నిర్మాణం, విలువ ఆధారిత ఉత్పత్తులు, కల్యాణ మండపాలు, బియ్యం తదితర వ్యాపారాలను గుర్తించి ఆ దిశగా పీఏసీఎస్‌లను మళ్లించడానికి అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటుంది. ఇప్పటి వరకు పంట రుణాలపై వచ్చే కమీషన్లపైనే సంఘాలు ఆధారపడేవి. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ద్వారా రుణాలపై నామమాత్రపు వడ్డీతో పాటు కొన్ని వ్యాపారాల్లో భాగస్వామ్యం కావడం ద్వారా పీఏసీఎస్‌ల ఆదాయం పెరగనుంది. తద్వారా సొసైటీలకు వచ్చే ఆదాయాన్ని తిరిగి రైతుల మేలు కోసం ఖర్చు పెట్టాలని నిర్ణయించింది. తద్వారా సహకార రంగాన్నే బలోపేతం చేసినట్లవుతుందనేది ప్రభుత్వ ఆలోచన. ఈ చర్యలతోపాటు త్వరలోనే ఎన్నికలు జరిపి పాలకవర్గాలను కొలువదీర్చాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

వసతులు లేని రెస్ట్ ఏరియాలు

- ఆహారం, మంచినీరు కూడా లేదు
- లారీ డ్రైవర్లు, క్లీనర్ల అగచాట్లు
- పట్టించుకునేదెప్పుడు

మార్టూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : తాంబూలాలు ఇచ్చాం తన్నుకు చావండి అన్నట్లుగా ఉంది మార్టూరు మండల పరిధిలో రాజుపాలెం రెస్ట్ ఏరియాలలో వాహనదారుల పరిస్థితి. సుదూరప్రాంతాల నుంచి లారీలపై సరుకులుగాని, ఇతరత్రా వాటిని రవాణా చేస్తున్న సమయంలో డ్రైవర్లు కొంత సమయం విశ్రాంతి తీసుకోవడానికి రెస్ట్ ఏరియాలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఎంతో దూరం నుంచి అలసిపోయి వాహనాలను నడిపే లారీ డ్రైవర్లు రాత్రి సమయంలో ప్రయాణిస్తూ రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన రెస్ట్ ఏరియాలో కనీస వసతులను కూడా ఏర్పాటు చేయలేదు. మార్టూరు మండల పరిధి 216వ జాతీయరహదారికి ఇరువైపులా రాజుపాలెం కూడలి సమీపంలో రెండు రెస్ట్ ఏరియాలను దాదాపుగా మూడేళ్ల కిందట ఏర్పాటు చేశారు. చెన్నై నుంచి కోల్‌కతా వెళ్లే ఈ జాతీయ రహదారిపై వాహనదారులు ముఖ్యంగా లారీడ్రైవర్లు కోసం, వారు విశ్రాంతి తీసుకోవడానికి అన్నివిధాలా అనుకూలమైన వసతులతో రెస్ట్ ఏరియాలను ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో హైవే వారు నిధులను మంజూరు చేశారు. తూర్పు, పడమర వైపున ఏర్పాటు చేసిన రెండు రెస్ట్ ఏరియాలలో ఇప్పటివరకు కనీస వసతులను ఏర్పాటు చేయలేదని డ్రైవర్లు, క్లీనర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంచినీరు, ఆహారం లేదు

హైవేపై ఒంగోలు, గుంటూరు వైపు దాదాపుగా 10 ఎకరాల విస్తీర్ణంలో రెండు రెస్ట్ ఏరియాలను ఏర్పాటు చేశారు. వాటిలో విశ్రాంతి తీసుకోవడానికి గదుల కోసం భవనం, క్యాంటీన్ కోసం మరో భవనం, షాపులు కోసం కొన్నిగదులు, ఇంకా తదితర భవనాలను నిర్మించారు. వాటి భద్రత కోసం సెక్యూరిటీ గార్డులను కూడా ఏర్పాటు చేశారు. కానీ విశ్రాంతి తీసుకోవడానికి అటువైపు ఎవరూ కన్నెత్తి కూడా చూడటంలేదు. మిగిలిన భవనాల తలుపులు ఎప్పుడూ మూసివేసి ఉంటాయి. రెస్ట్ ఏరియాకు వచ్చిన లారీ డ్రైవర్లు లేదా కార్లు, ప్రైవేటు బస్సులకు సంబంధించిన డ్రైవర్లు రెస్ట్ ఏరియాకు వస్తే కనీసం తాగడానికి మంచినీరు కూడా ఇక్కడ లేదు. ఆహారం తిందామంటే క్యాంటీన్ సౌకర్యం లేదు. అర్ధరాత్రి ఎక్కువగా వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారి నుంచి తప్పించుకోవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి రెస్ట్ ఏరియాలకు వస్తుంటారు ముఖ్యంగా రాష్ట్రం నుంచి కాకుండా చైన్నై, కేరళ, మహారాష్ట్ర, బీహార్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి ప్రయాణించే లారీలు రెస్ట్ ఏరియాకు వస్తుంటారు. ఈ సమయంలో వారు తినడానికి తిండి, తాగడానికి మంచినీటి కోసం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మార్టూరు సెంటరుకు రావాల్సిందే. దాంతో కొంతమంది వాహనదారులు ఈ రెస్ట్ ఏరియాలవైపు కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలవైపు చూస్తున్నారు. వాస్తవానికి రోజూ 70 నుంచి 100 దాకా పైగా వాహనాలు రెండు రెస్ట్ ఏరియాలకు వస్తుంటాయి. గతంలో తూర్పు వైపు ఉన్న రెస్ట్ ఏరియాలో రాత్రి సమయంలో ఒక లారీలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం కూడా చేశారు. ఈ నేపథ్యంలో రెస్ట్ ఏరియాలలో వాహనదారులకు భద్రత ఉండేవిధంగా నేషనల్ హైవే అధికారులు చర్యలు చేపట్టాలి. దూర ప్రాంతాలు నుంచి ప్రైవేటు వాహనాలలో వచ్చే ప్రయాణికులలో మహిళలు, చిన్నపిల్లలు ఉంటారు కనుక రెస్ట్ ఏరియాలో భద్రత ఉంటుందనే నమ్మకాన్ని వాహనదారులకు కలిగించాలి. అంతేగాకుండా ఏఏ నిబంధనలతో, ఉద్దేశాలతో, వాహనదారుల కోసం ఏర్పాటుచేస్తామన్న పూర్తి వసతులతో నేషనల్ హైవే వారు రెస్ట్ ఏరియాలను ఏర్పాటు చేశారో వాటిని పూర్తిగా అమలు చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.



రాజుపాలెం కూడలిలో తూర్పువైపున ఉన్న రెస్ట్ ఏరియాలో ఆగిన లారీలు

తెరుచుకోని రెస్టారెంట్



లారీ దగ్గర వంట చేసుకుంటున్న డ్రైవర్, క్లీనర్

టీ లేదు.. మంచినీళ్లులేవు



మాది బిహార్, ఇక్కడ ఏమీ బాగాలేదు. వంట లారీ దగ్గరే చేసుకుంటున్నాం. మంచి నీళ్లు, టీ, ఆహారం దొరకదు. రాత్రి లారీలోనే పడుకున్నాం. పెట్రోలు బంకు ఉంటే బాగుంటుంది.చాలా వసతులు ఏర్పాటు చేయాలి.

- బిజయ్‌కుమార్, లారీ డ్రైవర్, బిహార్

ముఖాముఖి

సంక్షేమ పథకాలు అర్హులకు అందాలి

చీరాల ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం



గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగింది. ఉపాధి అవకాశాలు లేక జీవన మనుగడ సాగక సామాన్యులు దీన స్థితిలో ఉన్నారు. ఈక్రమంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించింది. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. ఈనేపథ్యంలో పీ-4 సర్వేపై ఎంపీడీవోతో ఆంధ్రజ్యోతి ముఖాముఖి.

ప్రశ్న: ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జవాబు: గత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇప్పటికే అనేక కార్యక్రమాలు చేపట్టింది. ఈక్రమంలోనే తాజాగా పీ-4 (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్ పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని ప్రారంభించాం. అన్ని ప్రాంతాల్లో సర్వే నిర్వహించి ఉద్యోగ, నిరుద్యోగ, వ్యాపారవేత్తలను గుర్తించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం.

ప్ర: ఈ సర్వేతో అర్హులకు ఇబ్బందులు తలెత్తి, పథకాలు పోతాయేమో?

జ: పీ-4 సర్వేతో అర్హులకు ఎలాంటి నష్టం వాటిల్లదు. పైగా కొత్త పథకాలు అందించేందుకు అవకాశం కలుగుతుంది. అపోహాలు అవసరం లేదు.

ప్ర: పీ-4 ఎప్పుడు ప్రారంభిస్తారు ?

జ: ఈ సర్వే అన్ని ప్రాంతాల్లో వచ్చే శనివారం నుంచి ప్రారంభమై ఈనెల 18వ తేదీతో ముగుస్తుంది.

ప్ర: ఆచరణ ఎప్పుడు ?

జ: పారదర్శకంగా జరిగిన డేటాను 18వ తేదీ తరువాత ఆన్‌లైన్ చేస్తాం. ఉగాది నుంచి ఆచరణ అమలులోకి వస్తుంది. సర్వేలో దాదాపుగా అభివృద్ధిలో ఉన్న మొదటి 10 శాతం మందిని గుర్తిస్తాం. అలాగే అట్టడుగున ఉన్న చివరి 20 శాతం మందికి సహకరించేలా సూచనలు చేస్తాం. వీరితో ప్రభుత్వం కూడా తోడ్పాటు కల్పిస్తుంది

ప్ర: ప్రభుత్వం నిరుద్యోగులకు ఎలాంటి అవకాశాలు ఇవ్వబోతోంది ?

జ: పీ-4 ముగిశాక త్వరలోనే సబ్సిడీ రుణాలు అందించనుంది. ఈక్రమంలోనే ఇప్పటికే ఓబీ ఎంఎంఎస్ సైట్ ఓపెన్ అయి ఉంది. బీసీ, ఈబీసీ యువతీ యువకులు, నిరుద్యోగులు సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. అనంతరం ఇంటర్వ్యూ ద్వారా అర్హులకు రుణాలు అందిస్తాం. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు త్వరలోనే సబ్సిడీ రుణాలు అందిస్తాం.

వైసీపీ పాపం.. విద్యార్థులకు శాపం!



తిమ్మాయపాలెం జడ్పీహెచ్ఎస్‌లో పని చేయని వాటర్ ప్లాంట్

- నాడు-నేడులో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌లు మూలకు
- మరమ్మతులకు ముందుకు రాని కాంట్రాక్టర్
- తాగునీటి కల్పనకు విద్యాశాఖ అధికారుల ప్రత్యామ్నాయ చర్యలు

అద్దంకిటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ శాపం కారణంగా పాఠశాల విద్యార్థులు దాహం కేకలు వేస్తున్నారు. విద్యార్థులకు సురక్షిత తాగునీటిని అందించేందుకు గత వైసీపీ ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌లు మూలనపడ్డాయి. దీంతో విద్యార్థులు దాహంతో అల్లాడుతున్నారు. వేసవి కాలం రాబోతుండడంతో విద్యాశాల ఉన్నతాధికారులు ఆదేశాలలో పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్ల మరమ్మతులకు ప్రాధానోపాధ్యాయులు చర్యలకు పూనుకున్నారు.

మండలంలో 31 వాటర్ ప్లాంట్‌లు మంజూరు

గత వైసీపీ హయాంలో పాఠశాలలో నాడు-నేడు కింద 31 వాటర్ ప్లాంట్‌లను మంజూరు చేసింది. విద్యార్థుల సంఖ్యను ఆధారంగా రూ.75వేలు, రూ.1.50లక్షలు, రూ.2.50లక్షల విలువైన మూడు రకాల వాటర్‌ప్లాంట్‌లను పేజ్-1లో మంజూరు చేసింది. అయితే ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్ రెండు మూడు నెలలు కూడా పని చేయకుండా మూలనపడ్డాయి. మరమ్మతులకు సంబంధిత కాంట్రాక్టర్‌లకు ఎన్ని సార్లు చెప్పినా వచ్చి చూడడం తప్ప వాటిని మరమ్మతులు చేయలేదు. దీంతో అవి ఏళ్ల తరబడి నిరుపయోగంగా పడిఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం పాఠశాలలు చెందిన ఫండ్స్‌ను ఇవ్వకపోవడంతో వాటర్‌ప్లాంట్‌ల మరమ్మతులను హెచ్‌ఎంలు చేయించలేదు. దీంతో అవి ఆలంకారప్రాయంగానే మిగిలిపోయ్యాయి.



గోరకాపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న వాటర్‌ప్లాంట్

తాగునీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

నాటి ప్రభుత్వం ఇచ్చిన వాటర్ ప్లాంట్‌లు నిరుపయోగంగా మారడంతో పలు పాఠశాలలో విద్యార్థులకు తాగునీటిని అందించేందుకు గ్రామంలోని వాటర్ ప్లాంట్‌ల వద్ద నుంచి వాటర్ క్యాన్‌లతో నీటిని కొనుగోలు చేసి దాహం తీరుస్తున్నారు. మరి కొన్ని పాఠశాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్‌ల ద్వారా విద్యార్థుల దాహార్తిని తీరుస్తున్నాయి.

విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో మరమ్మతులకు చర్యలు

వేసవి కాలం వస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎటువంటి తాగునీటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలలో మూలనపడిన నాడు-నేడు వాటర్‌ప్లాంట్‌ల పరిస్థితిని పరిశీలించి వెంటనే తగు మరమ్మతులకు ఆయా పాఠశాలల ప్రాధానోపాధ్యాయులు చర్యలు చేపట్టారు. వాటర్‌ప్లాంట్‌ల పరిస్థితి ఏమిటి ఎంత ఖర్చు అవుతుంది, వాటికి సంబంధించిన వస్తువుల కోనుగోలు వంటివి ఏర్పాటు చేసి ప్లాంట్‌లను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పాఠశాలలకు సంబంధించిన ఫండ్స్‌ను విదుదల చేయడం, వాటిని తోడు కొంత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఖర్చు చేసి ప్లాంట్‌లను వినియోగంలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ఒకటి రెండు పాఠశాలల్లో ఉన్న వాటర్‌ప్లాంట్‌లను మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చారు. లక్షలు ఖర్చు చేసి నిరుపయోగంగా పెట్టిన వాటర్‌ప్లాంట్‌లను మరమ్మతులు చేయించి విద్యార్థులు తాగునీటికి ఇబ్బంది లేకుండా తీసుకుంటున్న చర్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గోరకాయపాలెం పాఠశాలలో తాగునీటి కోసం పెట్టిన వాటర్ క్యాన్

మూలనపడిన ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ

- ఏలూరి ఆదేశంతో నీటిపారుదల శాఖ డీఈ పరిశీలన
- రైతులకు నిర్వహణ అప్పగింత

ఇంకొల్లు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో నిర్వహణ సక్రమంగా లేక ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మూలనపడ్డాయి. ఆ పథకాలను తిరిగి పనరుద్ధరించి రైతులకు ఉపయోగపడేలా మహారాష్ట్ర రాష్ట్రంలో లాగే రైతులే సొసైటీగా ఏర్పడి నిర్వహణ చేసుకునేలా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషి చేస్తున్నారు. ఇందుకు సంబంధించి నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాలను పరిశీలించి మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేసేందుకు రిటైర్డు నీటిపారుదల శాఖ డీఈ సత్యనారాయణను కోరారు. ఈ మేరకు మండలంలోని నిరుపయోగంగా ఉన్న రెండు ఎత్తిపోతల పథకాలను సత్యనారాయణ గురువారం ముప్పాళ్ల (కొణికి), గొల్లపాలెం ఎత్తిపోతల పథకాలను పరిశీలించారు. రైతులను అడిగి వాటి నిర్వహణ విధివిధానాలు తెలుసుకున్నారు. పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు చేయాల్సిన మరమ్మతులపై చర్చించారు. ఈ రెండు ఎత్తిపోతలను పునరుద్ధరిస్తే రైతులకు మేలు జరుగుతుందని రైతులు తెలిపారు. ఎమ్మెల్యే కృషిని వారు అభినందించారు. ఎత్తిపోతలను పరిశీలించిన వారిలో టీడీపీ నాయకులున్నారు.



కొణికి ఎత్తిపోతలను పరిశీలిస్తున్న బృందం



బెస్ట్ అటాకర్‌గా నిలిచిన శివారెడ్డిని అభినందిస్తున్న క్రీడామంత్రి రాంప్రసాద్‌రెడ్డి

వరల్డ్ కప్ పోటీలో ఖోఖో బెస్ట్ అటాకర్ శివారెడ్డిని అభినందించిన మంత్రి

పంగులూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని ఢిల్లీలో జనవరిలో జరిగిన ప్రపంచ కప్ ఖోఖో పోటీలలో ఇండియా జట్టులో పాల్గొని బెస్ట్ అటాకర్‌గా నిలిచిన పంగులూరు ఎస్ఆర్ ఖోఖో అకాడమీ క్రీడాకారుడు పి.శివారెడ్డి గురువారం క్రీడల శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో తనను కలిసిన ఖోఖో క్రీడాకారుడు శివారెడ్డిని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో ఖోఖో క్రీడలో ప్రతిభచాటిన శివారెడ్డికి ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని అకాడమీ నిర్వాహకులు, ఖోఖో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డి మంత్రికి విన్నవించారు. కూటమి ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యతను ఇస్తుందని, క్రీడాకారులకు ప్రభుత్వ పక్షాన తగిన తోడ్పాటును అందిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు సీతారామిరెడ్డి తెలిపారు.

ఫలితాల సాధనకే వంద రోజుల ప్రణాళిక



వల్లాపల్లి పాఠశాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న డిప్యూటీ ఈవో గంగాధర్

బల్లికురవ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరిక్షలలో నూరు శాతం ఫలితాలు సాధించే లక్ష్యంతోనే ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో వంద రోజు ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తుందని, ఉపాధ్యాయులు బాధ్యతతో పని చేయాలని చీరాల డిప్యూటీ ఈవో జి.గంగాధర్ తెలిపారు. గురువారం మండలంలోని వల్లాపల్లి సీఏయూపీఎస్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ పాఠశాలలో రెండో పోస్టు అవసరమని యజమాన్యం దరఖాస్తు చేయగా తనిఖీలు చేసి ఉన్నత అధికారులకు నివేదిక అందించేందుకు వచ్చిన్నట్లు అయన తెలిపారు. ఆనంతరం బల్లికురవ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఈ తనిఖీలో ఎంఈవో రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

బల్లికురవ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజలంతా ప్రమాదాలు జరగకుండా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సంతమాగులూరు సర్కిల్ సీఐ కె.వెంకట్రావు కోరారు. గురువారం బల్లికురవ పోలీసు స్టేషన్‌కు పరిశీలించిన అనంతరం అయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు అవగాహన లేక మైనర్లకు వాహనాలను ఇస్తున్నారని, దీంతో ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఆలానే కూలీలను ఆటోలలో పరిమితికి మంచి ఎక్కిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు, హెల్మెట్ తపనిసిగా ఉండాలని సూచించారు.

యవతిని వేధించిన కేసులో వ్యక్తికి రిమాండ్

వేటపాలెం(చీరాల), మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించమని యువతిని వేధించిన కేసులో నిందితుడిని వేటపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. అందిన వివరాల ప్రకారం.. చీరాలకు చెందిన యువతిని అదే ప్రాంతానికి చెందిన యువకుడు కొంత కాలంగా వేధిస్తున్నాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు గురువారం వేటపాలెం పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అలాగే కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

ముసలి, కొండచిలువ సంచారం

పరిశీలించిన అటవీశాఖ అధికారులు



నరసింహాపురం రెవెన్యూ పరిధిలో ముగ్గు వాగును పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

అద్దంకి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నరసింహాపురం (డీ పాపులేటెడ్ విలేజ్) రెవెన్యూ పరిధిలో గుండ్లకమ్మ నది సమీపంలో ముగ్గు వాగు పరిసర ప్రాంతంలో ముసలి, కొండ చిలువ సంచారంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడురోజుల కిందట మొసలి కన్పించగా, గురువారం కొండచిలువ కనిపించినట్లు రైతులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అధికారులు ఆ ప్రాంతంలో పరిశీలించగా ముసలి, కొండచిలువ ఆనవాళ్లు కనిపించలేదు. రైతులు తాము తీసిన వీడియోలను అధికారులకు చూపించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని కూకట్లపల్లి బీట్ ఆఫీసర్ రమేష్ సూచించారు. సెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధం

చినగంజాం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధమైన సంఘటన చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాలలో గురువారం జరిగింది. సోపిరాలకు చెందిన తుమ్మలపెంట జయరావుకు చెందిన రెండు ఎకరాలు, పల్లపోలు వెంకటేశ్వర్లులకు చెందిన రెండు ఎకరాల గడ్డి వాములు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. పక్కపక్కనే ఉన్న గడ్డివాములలో జయరావుకు చెందిన గడ్డివాము దగ్ధం కావడం చూసిన గ్రామస్థులు చీరాల ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందజేశారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. ఇటీవల ఎకరం గడ్డి రూ.20వేల చొప్పున కొనుగోలు చేసి గడ్డి వాములు వేశామని బాధితులు తెలిపారు. గడ్డివాములు పూర్తిగా దగ్ధం కావడంతో రూ.80వేలు నష్టం పోయామని, పశువులకు పశుగ్రాసం లేకుండా పోయిందని అన్నారు. సంఘటనా స్థలాన్ని గ్రామ రెవెన్యూ అధికారి ఆమంచి సత్యనారాయణ పరిశీలించారు.



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది



అంకమ్మతల్లి విగ్రహాన్ని తాకిన భానుడి కిరణాలు

అంకమ్మ తల్లి విగ్రహానికి సూర్యకిరణాభిషేకం

మార్టూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్రోణాదుల గ్రామంలో అంకమ్మ దేవత శక్తి క్షేత్రంలో గురువారం ఉదయం అంకమ్మ తల్లి విగ్రహాన్ని సూర్యకిరణాలు తాకాయి. ఏటా మార్చిలో అమ్మవారి విగ్రహాన్ని సూర్యకిరణాలు తాకడం ఆనవాయితీగా వస్తున్నదని ప్రధాన పూజారి అళహరి పూర్ణచంద్రరావు తెలిపారు. ఆలయంలో ఈ దృశ్యాన్ని భక్తులు చూసి పరవశించిపోయారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ



పార్టీ సభ్యత్వ కార్డులతో టీడీపీ నాయకులు

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్డులను పార్టీ నాయకులు పంపిణీ చేశారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన సభ్యత్వ నమోదు కార్డులు యద్దనపూడిలోని పార్టీ కార్యాలయానికి చేరాయి. అక్కడ నుంచి వివిధ గ్రామాలకు చెందిన నాయకులు సభ్యత్వ కార్డులను తీసుకువెళ్లి కార్యకర్తలకు అందచేశారు. కార్యక్రమంలో నల్లపనేని రంగయ్యచౌదరి, కనపర్తి నాగేశ్వరరావు, రావిపాటి సీతయ్య, గుదే తారకరామారావు, కొరిటాల వంశీకృష్ణ పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర ఇవ్వాలని వినతి

ఇంకొల్లు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పంటలకు గిట్టుబాటు ధర ఇచ్చి, రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు గురువారం తహసీల్దార్ వెంకటరత్నంకు వినతిపత్రం అందజేసారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, ఈ ఏడాది రైతులు తీసుకున్న రుణాలను రద్దు చేయాలని, పొగాకు బోర్డును ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కలిపించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, మాదాల అంజియ్య, రైతులు పాల్గొన్నారు.



భూమి పూజలో పాల్గొన్న జనసేన పార్టీ మార్కండేయులు, విజయ్, అరుణ, స్వాములు, కార్యకర్తలు

అభివృద్ధి పథంలో రాష్ట్రం

అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ సభ్యుడు మార్కండేయులు

చీరాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పథంలో ముందకు సాగుతోందని, అందుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విశేష కృషి చేస్తున్నారని జనసేన అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ డెవలప్‌మెంట్ సభ్యుడు వడ్డాణం మార్కండేయులు, ఎస్సీ మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్, జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ అన్నారు. జనసేన రాష్ట్ర నాయకులు ఆమంచి స్వాములు గురువారం వేటపాలెం జాతీయ రహదారిలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవస్థానం సమీపంలో నియోజకవర్గ అధికారక పార్టీ కార్యాలయానికి భూమిపూజను నిర్వహించారు. పార్టీ నాయకులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కండేయులు స్వాములు సేవలను కొనియాడారు. అనుకోని రీతిలో స్వాములు పార్టీకి రాజీనామా చేసినట్లు చెప్తున్నా పార్టీ అధిష్టానం అంగీకరించలేదని చెప్పారు. అలాగే స్వాములు మాట్లాడుతూ సోషల్ మాధ్యమాల్లో డిప్యూటీ సీఎంపై చేస్తున్న వ్యాఖ్యలను ఖండించారు. పిఠాపురంలో ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీసీ రోడ్డును తనిఖీ చేస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

నాణ్యత ఉంటేనే బిల్లుల చెల్లింపు

బల్లికురవ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల గ్రామాలలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల పనుల్లో నాణ్యతగా ఉంటేనే బిల్లులు చెల్లిస్తామని ఒంగోలు క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఈఈ ఎంవీ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ముక్తేశ్వరం, గొర్రెపాడు, వెలమవారిపాలెం, కూకట్లపల్లి, ఎస్ఎల్ గుడిపాడు గ్రామాలలో ఇటీవల రూ.90 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, కాలువలను క్వాలిటీ కంట్రోల్ అధికారులు ప్రత్యేక మిషన్ ద్వారా తనిఖీలు చేశారు. పనుల్లో నాణ్యతను పరిశీలించారు. రోడ్లు బాగున్నాయని వారు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఏఈ సీహెచ్ శ్రీనివాస్, మండల పీఆర్‌ఏఈ మాధవ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంకొల్లులో రోడ్ల తనిఖీ

ఇంకొల్లు : ఇటీవల కూటమి ప్రభుత్వం నిర్మించిన రోడ్లను గురువారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. ఇంకొల్లు సంతరావూరు రోడ్డు, గంగవరం ఆర్ అండ్‌బీ రహదారులు పూర్తిగా అధ్వానంగా మారాయి. దీంతో కూటమి ప్రభుత్వం రోడ్లకు మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణ చర్యలు తీసుకుంది. కాంట్రాక్టర్ చేపట్టిన రోడ్ల నిర్మాణంలో నాణ్యతాప్రమాణాలను క్వాలిటీ కంట్రోల్ అధికారులు డీఈ నాగేంద్రబాబు, జేఈ సుబ్రహ్మణ్యం, ఏఈ శ్రీకాంత్ పరిశీలించారు.

తిరునాళ్లలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు

చీరాల డీఎస్పీ మొయిన్



తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న చీరాల డీఎస్పీ మొయిన్

అద్దంకి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ 70 వ వార్షిక తిరునాళ్ల ఈ నెల 14వ తేదీన జరగనున్న నేపథ్యంలో అద్దంకి పట్టణంతోపాటు తిరునాళ్ల జరిగే ప్రాంతంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చీరాల డీఎస్పీ మొయిన్ అన్నారు. తిరునాళ్లకు స్వామివారి దర్శనానికి వెళ్లే భక్తుల క్యూలైన్‌లు, ఎంట్రెన్స్ ఎగ్జిట్ ద్వారాలు, దర్శనం వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం దేవస్థానం ముందు, భవనాసి చెరువు కట్ట వద్ద, గోపాలపురం సమీపంలో ఏర్పాటు చేయనున్న వాహనాల పార్కింగ్ ప్రాంతాలలో పరిశీలించారు. ప్రధానంగా నామ్ రోడ్డులో ట్రాఫిక్ మళ్లింపు, అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్‌లో రద్దీ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తిరునాళ్లకు 700 మందితో పోలీస్ సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సీఐ సుబ్బరాజు, రూరల్ ఎస్సై రవితేజ తదితరులు ఉన్నారు.